thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com


RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 134 | జగిత్యాల | ఆదివారం | 16 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ట్రాక్ పై సైక్లిస్ట్ దుర్మరణం




11

# వికసిత భారత్‌కు ‘సప్తధార’!

- ప్రపంచ నాయకత్వమే భారత్ లక్ష్యం
- తయారీ నుంచి రక్షణ దాకా ఏడు రంగాలపై గురి
- యువశక్తి.. సాంకేతికతతో సరికొత్త ప్రగతి పథం
- జనగణనలో కచ్చితమైన సమాచారమివ్వాలని పిలుపు
- స్వయం సమృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్
- ఎర్రకోట నుంచి భవిష్యత్ భారతానికి మోదీ దిశానిర్దేశం





వివరాలు 4వ పేజీలో







## తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా

# తీర్చిదిద్దుతాం

ఉద్యోగ నియామకాలు మా ప్రభుత్వ కీలక బాధ్యత

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నదే మా విధానం

### కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను వదులుకోం

- విద్య, వైద్యం, ఉపాధి.. ప్రతి కుటుంబానికి భరోసా
- యువతకు నైపుణ్యాలు.. మహిళలకు ఆర్థిక స్వావలంబన
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి 3లక్షల కోట్ల డాలర్ల తెలంగాణను నిర్మిస్తాం
- గోల్కొండ కోట నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

“తెలంగాణ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం. రైతు నుంచి విద్యార్థి వరకు, మహిళ నుంచి నిరుద్యోగ యువకుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకురావడమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లు, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతాం” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం కూడా ఇదే దిశగా రూపొందింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

- హైదరాబాద్, ఆగస్టు 15

2



## రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

- పేదరికం నిర్మూలించే బలమైన అడుగు
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్
- రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే
- సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం
- కేసీఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం: సీఎం
- బీజేపీ, బీఆర్ఎస్ ఒకే నాణేనికి బొమ్మా బొరుసు
- సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

2

## పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

- బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్



.. వివరాలు 4లో

## టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

- ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య



4

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో

## ‘వందేమాతరం’ దమ్ముంటే అడ్డుకోండి

ఎంఐఎంకు బండి సంజయ్ సవాల్



.. వివరాలు 2లో

# సంగారెడ్డి సభలో రేవంత్‌వన్నీ అబద్ధాలే

- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం 4.20కి ప్రసంగం మొదలుపెట్టి ‘420’ మాటలు మాట్లాడారు
- రేషన్‌కార్డుల నుంచి ఉద్యోగాల దాకా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- రుణమాఫీపై రేవంత్‌కు హరీశ్‌రావు రాజీనామా సవాల్

3



# ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం

- హద్దు మీరితే ఇంటికొచ్చి గుణపాఠం చెబుతాం
- బీజేపీ ఎంపీ అరవింద్‌కు కాంగ్రెస్ నేతల హెచ్చరిక
- మహేశ్‌కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలను ఖండించిన నేతలు
- పసుపు బోర్డు?గల్ఫ్ బాధితులకు ఏం చేశారంటూ నిలదీత
- దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్

2



# బేవకూఫ్ ఇప్పుడే చెప్పిన కదా!..

- జర్నలిస్టుపై నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ అర్వింద్
- వెంటనే క్షమాపణ చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్



2

విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టుపై నిజామాబాద్ బీజేపీ అర్వింద్ నోరు పారేసుకున్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టును ఉద్దేశించి ‘బేవకూఫ్’ ఇప్పుడే చెప్పిన కదా..! వినా లే..’ అంటూ అహంకార ధోరణిలో వ్యాఖ్య లు చేశారు. జర్నలిస్టుపై ఎంపీ అర్వింద్ చేసి న వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. జర్నలిస్టులు ఎంపీ అహంకార ధోరణిపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

## గ్యాస్ ఈకేవైసీకి నేటితో ముగియనున్న గడువు



2

## తెలంగాణపై ఏపీ నీటి కుట్రలు

2

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం

మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్




## నల్సార్ విద్యార్థులకు బీసీఐ చైర్మన్ క్షమాపణ

2

- మనోభావాలు దెబ్బతీసి ఉంటే మన్నించాలని లేఖ






## భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో 'వందేమాతరం'

**దమ్ముంటే అడ్డుకోండి.. ఎంఐఎంకు బండి సంజయ్ సవాల్**

**గీతాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు, జరిమానా తప్పదని హెచ్చరిక**

**స్మార్ట్ రేషన్ కార్డులపై సీఎం, మంత్రుల ఫొటోలెందుకని ప్రశ్న**

**ఉచిత బియ్యంపై మోదీ ఫొటో ఎందుకు లేదని నిలదీత**

**హైదరాబాద్, ఆగస్టు 15:** పాతబస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద లక్ష మందితో సామూహికంగా 'వందేమాతరం' గీతాలాపన చేయిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. "ఎంఐఎం నేతలారా.. దమ్ముంటే అడ్డుకోండి" అంటూ సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా తప్పదని హెచ్చరించారు. చట్ట ప్రకారం వ్యవహరిస్తున్న తమను మతతత్వవాదులుగా చిత్రీకరించడం ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. దేశభక్తిని చాటే వందేమాతరం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. భాగ్యలక్ష్మి ఆలయం వద్ద భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి సామూహిక గీతాలాపన నిర్వహిస్తామని ప్రకటించారు. ఇదే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపైనా బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు ఎందుకు ముద్రించారని ప్రశ్నించారు. తెలంగాణలో దాదాపు రెండు కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తోందని పేర్కొన్నారు. అలాంటప్పుడు రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదని నిలదీశారు. కేంద్రం అందిస్తున్న బియ్యం రాష్ట్ర ప్రభుత్వానికి అవసరం లేదా అని ప్రశ్నించారు. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో వందల కోట్ల రూపాయలతో రూపొందించిన స్మార్ట్ కార్డులు చివరకు నిరుపయోగంగా మారాయని బండి సంజయ్ గుర్తుచేశారు. తెలంగాణలోనూ ప్రచారం కోసం ప్రజాధనాన్ని వృథా చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనంగా ఉందని, "తుమ్మితే ఊడిపోయే పరిస్థితిలో ఉంది" అంటూ ఎద్దేవా చేశారు.

## గ్యాస్ ఈకేవైసీకి నేటితో ముగియనున్న గడువు

**పూర్తి చేయాలంటూ వినియోగదారులకు ఏజెన్సీల సందేశాలు**

**గ్యాస్ ఏజెన్సీల వద్ద పెరిగిన వినియోగదారుల రద్దీ**

**గడువు పొడిగింపుపై స్పష్టత కోసం ఎదురుచూపులు**

**హైదరాబాద్, ఆగస్టు 15:** గ్యాస్ వినియోగదారుల ఈకేవైసీ ప్రక్రియకు ఈ నెల 16వ తేదీ సాయంత్రంతో గడువు ముగియనున్న నేపథ్యంలో వినియోగదారుల్లో హడావుడి మొదలైంది. ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలంటూ పలు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సందేశాలు పంపడంతో పాటు ఫోన్లు చేసి సమాచారం అందిస్తున్నాయి. దీంతో ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు ఏజెన్సీల వద్ద వినియోగదారులు క్యూకడుతున్నారు. ఈకేవైసీ పూర్తి చేయకపోతే గ్యాస్ సరఫరా, సబ్సిడీ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయనే ప్రచారం జరుగుతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. గడువు సమీపిస్తుండటంతో చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఏజెన్సీల నిర్వాహకులు సూచిస్తున్నారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం, ఆ వెంటనే ఆదివారం రావడంతో ఏజెన్సీలు పనిచేస్తాయా లేదా అనే విషయంలో వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు ఏజెన్సీల నిర్వాహకులు స్పందిస్తూ గడువు నేపథ్యంలో సెలవు రోజుల్లోనూ సేవలు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. గడువు పొడిగింపుపై ఉన్నతస్థాయి నుంచి నిర్ణయం వస్తే పరిస్థితి మారవచ్చని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గడువు పొడిగింపుపై అధికారిక ప్రకటన కోసం ఎదురుచూడకుండా వినియోగదారులు తమ గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈకేవైసీ స్థితిని తెలుసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల గడువు ముగింపు

**హైదరాబాద్, ఆగస్టు 14** హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు. మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు అమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.



# తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం

- ఉద్యోగ నియామకాలు మా ప్రభుత్వ కీలక బాధ్యత
- రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నదే మా విధానం
- కృష్ణా-గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను వదులుకోం
- విద్య, వైద్యం, ఉపాధి.. ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తాం
- యువతకు నైపుణ్యాలు.. మహిళలకు ఆర్థిక స్వావలంబన
- 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల తెలంగాణను నిర్మిస్తాం
- గోల్కొండ కోట నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 15:** "తెలంగాణ ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తాం. రైతు నుంచి విద్యార్థి వరకు, మహిళ నుంచి నిరుద్యోగ యువకుడి వరకు ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు తీసుకురావడమే మా ప్రజా ప్రభుత్వ లక్ష్యం. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లు, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం కూడా ఇదే దిశగా రూపొందింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. వారి ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధితో కూడిన తెలంగాణను నిర్మించుకోవాలి. అందుకు ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి" అని పిలుపునిచ్చారు. "నిరుద్యోగ యువత ఎదురుచూపుల బాధ నాకు తెలుసు. అందుకే ఉద్యోగ నియామకాలను మా ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుంది. ఇప్పటివరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం. గ్రూప్ పరీక్షలు, మెగా డీఎస్సీ సహా నియామక ప్రక్రియలను సమర్థంగా నిర్వహించాం. నియామక వ్యవస్థపై యువతకు నమ్మకం కలిగేలా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశాం. ఉద్యోగాలతో పాటు యువతకు అవసరమైన



నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని సీఎం వివరించారు. "రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటదన్నది నా బలమైన నమ్మకం. అందుకే వ్యవసాయాన్ని పండగ చేయాలని నిర్ణయించుకున్నాం. రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసాతో పెట్టుబడి సాయం అందిస్తున్నాం. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు పండించిన ప్రతి గింజకు విలువ దక్కేలా మా ప్రభుత్వం రైతుకు అండగా నిలబడుతుంది" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. "కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మనకు హక్కుగా రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధిస్తాం. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పాలమూరు రైతుల పొలాలకు నీళ్లు పారిస్తాం. తెలంగాణ రైతుల కళ్లలో ఆనందం చూడడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కృష్ణా, గోదావరి జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తామన్న ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి గత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ ప్రకటించారు.

### పేదవాడికి వైద్యం భారంగా మారొద్దు

"డబ్బులు లేవనే కారణంతో ఏ పేద కుటుంబం వైద్యానికి దూరం కాకూడదు. అందుకే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. నిమ్స్‌లో 2 వేల పడకల కొత్త ఆసుపత్రితో పాటు రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సదుపాయాలను విస్తరిస్తున్నాం. కొత్త వైద్య, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ప్రజలకు విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా భావిస్తున్నాం" అన్నారు. "పేదవాడి బిడ్డ కూడా కార్పొరేట్ స్థాయి విద్యను పొందాలి. చదువుతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవాలి. అందుకే నియోజకవర్గాల్లో సమీకృత పాఠశాలలను నిర్మిస్తున్నాం. వందకు పైగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తాం. మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం" అని సీఎం చెప్పారు. "మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం ఎదుగుతుంది. కుటుంబం ఎదిగితేనే తెలంగాణ ఎదుగుతుంది. అందుకే కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. మహిళా సంఘాలకు వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నాం. ఆర్టీసీ అద్దె బస్సులకు మహిళలను యజమానులుగా చేస్తున్నాం. పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు కల్పిస్తున్నాం" అన్నారు.

### యువత చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

"మన యువతలో ప్రతిభకు కొదవలేదు. వారికి అవకాశం, శిక్షణ, వేదిక కావాలి. చదువుతో పాటు నైపుణ్యాలను అందిస్తాం. క్రీడల్లో మట్టిలోని మాణిక్యాలను వెలికితీస్తాం. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా తీర్చిదిద్దుతాం. మన యువత ప్రపంచస్థాయిలో తెలంగాణ పేరు నిలబెట్టేలా ప్రభుత్వం అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. "హైదరాబాద్ మన రాష్ట్రానికి ఆర్థిక ఇంజిన్. ఈ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలి. ప్రాంతీయ రింగురోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణతో భవిష్యత్ హైదరాబాద్‌ను నిర్మిస్తున్నాం. పెట్టుబడులు తీసుకొస్తాం.. పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం.. మన యువతకు ఇక్కడే ప్రపంచస్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### ప్రపంచానికి తెలంగాణ సత్తా చూపిస్తాం

"మన లక్ష్యాలు చిన్నవి కావు. తెలంగాణకు ఉన్న శక్తి, సామర్థ్యాలపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే మన లక్ష్యం. ఇది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంకల్పం కావాలి. ప్రజలు ఎదిగినప్పుడే తెలంగాణ నిజంగా ఎదిగినట్లు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "సంక్షేమం మా బాధ్యత.. అభివృద్ధి మా సంకల్పం.. సామాజిక న్యాయం మా విధానం. రైతు ముఖంలో ఆనందం, యువత చేతిలో ఉద్యోగం, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు విద్య--వైద్యం అందిస్తూ ప్రపంచంతో పోటీ పడే తెలంగాణను నిర్మిస్తాం. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాన్ని ప్రజలందరి సహకారంతో సాధించి తీరుతాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# రేషన్ కార్డు ఆత్మగౌరవ ప్రతీక

**పేదరికం నిర్మూలించే బలమైన అడుగు**

**పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్**

**రేషన్ కార్డులతో పాటు..సన్న బియ్యం ఘనత మాదే**

**సంక్షేమ కార్యక్రమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం**

**కేసీఆర్ వస్తే ఎవరేం చేశారో చర్చిస్తాం**

**బీజేపీ, బీఆర్ఎస్ ఒకే నాణేనికి బొమ్మా బొరుసు**

**సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సీఎం**



**సంగారెడ్డి, ఆగస్టు 15:** "రేషన్ కార్డు అంటే కేవలం ప్లాస్టిక్ కార్డు కాదు.. ఉచితంగా బియ్యం తీసుకునే సాధనం అంతకన్నా కాదు. అది పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక. పేదరికాన్ని నిర్మూలించే దిశగా మా ప్రజా ప్రభుత్వం వేసిన బలమైన అడుగు. తెలంగాణలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో అలమటించకూడదన్నదే మా సంకల్పం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. "స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేలాది మంది మహిళల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలన్న ఇందిరమ్మ ఆశయమే మా ప్రభుత్వానికి మార్గదర్శకం. ఆ స్ఫూర్తితోనే ప్రజా సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక కొత్త కార్డుల జారీని ప్రారంభించాం. రేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. ఇప్పుడు అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నాం" అని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా దాదాపు 3.48 కోట్ల మందికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. "గతంలో పేదలకు ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని మనుషులు తినలేని పరిస్థితి ఉండేది. అది పక్కదారి పట్టేది. ఇప్పుడు ప్రతి పేద కుటుంబం గౌరవంగా తినే సన్నబియ్యం అందిస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. ఇందుకోసం రూ.14,800 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పేదల కడుపు నింపడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను మేం నెరవేరుస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### కేసీఆర్ వస్తే అసెంబ్లీలోనే తేల్చుకుందాం


"పేదలకు ఎవరు ఏం చేశారో చర్చించడానికి మేం సిద్ధం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. పదేళ్లలో మీరు ఏం చేశారో చెప్పండి.. మా పాలనలో మేం ఏం చేశామో చెబుతాం. సంక్షేమంపై అసెంబ్లీ వేదికగా లెక్కలతో చర్చిద్దాం" అంటూ రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రైతుల సంక్షేమంపైనా తమ ప్రభుత్వానికి స్పష్టమైన చిత్తశుద్ధి ఉందన్నారు. "రైతులు పండించిన ధాన్యానికి రూ.90 వేల కోట్లు చెల్లించాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతును రాజుగా చూడాలన్నదే మా విధానం" అని చెప్పారు. "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. గతంలో బతుకమ్మ చీరల్లోనూ కమీషన్ల కోసం చూశారు. మేం ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం" అని సీఎం అన్నారు. గత ప్రభుత్వ గృహ నిర్మాణ విధానంపై రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లంటూ గొప్పలు చెప్పారు. పేదలకు మాత్రం ఇళ్లు రాలేదు.. పాలకులకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేం ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు అందిస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండకూడదన్నదే మా లక్ష్యం" అని చెప్పారు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తున్నామని, అర్హులైన చేనేత, గీత కార్మికులకు కూడా పెన్షన్లు అందిస్తామని ప్రకటించారు. "కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. కానీ తెలంగాణ నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. మా ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తోంది. యువతను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. వారి మాయమాటలను నమ్మొద్దు" అని సీఎం పిలుపునిచ్చారు. "గత పాలకులు చేసిన అప్పులకు మేం వేల కోట్ల రూపాయల వడ్డీలు కడుతూనే ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పేదలకు ఇచ్చిన మాట నుంచి వెనక్కి తగ్గేది లేదు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు దానిపై నిలబడే ప్రభుత్వం మాది. తెలంగాణను సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదు. అవి ఒకే నాణేనికి బొమ్మా బొరుసు. పేదవాడి ఆకలి తీర్చడం, రైతుకు అండగా నిలవడం, మహిళలకు భరోసా ఇవ్వడం, యువతకు ఉద్యోగాలు కల్పించడమే మా ప్రజా ప్రభుత్వ ఎజెండా" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## నల్సార్ విద్యార్థులకు బీసీఐ చైర్మన్ క్షమాపణ

**ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత ఉత్తర్వులపై మిశ్రా విచారం**

**విద్యార్థుల మనోభావాలు దెబ్బతీసి ఉంటే మన్నించాలని లేఖ**

**హైదరాబాద్, ఆగస్టు 16:** నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా వెనక్కి తగ్గారు. ఈ వ్యవహారంలో తన లేఖ లేదా వ్యాఖ్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసి ఉంటే క్షమించాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేసిన లేఖలో విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ తెలిపారు. విచారం వ్యక్తం చేయడం ప్రతిష్ఠకు, అహంకారానికి సంబంధించిన అంశం కాదని మిశ్రా పేర్కొన్నారు. విద్యార్థుల భావాలు, వారి ఆందోళనలకు విలువ ఇవ్వడమే ముఖ్యమని తెలిపారు. నల్సార్ విద్యార్థుల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై విచారం వ్యక్తం చేశారు. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్ బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ బీసీఐ ఇటీవల రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేయడంతో వివాదం చెలరేగింది. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరుకావడాన్ని సుమారు 450 మంది విద్యార్థులు వ్యతిరేకించిన నేపథ్యంలో బీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నీట్--యూజీ పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును ఆక్షేపిస్తూ విద్యార్థులు నిరసనకు దిగారు. బీసీఐ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సామాజిక మాధ్యమాల్లోనూ పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తం కావడంతో గంటల వ్యవధిలోనే




ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత నోటిఫికేషన్‌ను బీసీఐ ఉపసంహరించుకుంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. శాంతియుతంగా నిరసన తెలియజేయడం విద్యార్థుల హక్కని స్పష్టం చేస్తూ, ఈ విషయంలో బీసీఐ జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. తాజాగా బీసీఐ చైర్మన్ స్వయంగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పడంతో కొద్దిరోజులుగా కొనసాగుతున్న వివాదం సద్దుమణిగినట్లయింది.

చురకలు

ఆదివారం 16.08.2026

# సంగారెడ్డి సభలో రేవంత్‌వన్నీ అబద్ధాలే

- కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి
- సాయంత్రం 4.20కి ప్రసంగం మొదలుపెట్టి '420' మాటలు మాట్లాడారు
- రేషన్‌కార్డుల నుంచి ఉద్యోగాల దాకా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- రుణమాఫీపై రేవంత్‌కు హరీశ్‌రావు రాజీనామా సవాల్



**సిద్దిపేట, ఆగస్టు 15:** సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాల ప్రచారం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. దేశంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఇంతటి చిల్లర మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి మరొకరు ఉండరని విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి సభలో రేవంత్‌రెడ్డి సాయంత్రం 4.20 గంటలకు ప్రసంగం ప్రారంభించి '420 మాటలు' మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి గురించి ఒక్క మాట కూడా మాట్లాడకుండా కేసీఆర్‌పై విమర్శలకే ప్రసంగాన్ని పరిమితం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ చేతకానితనం వల్లే సింగూరు ఖాళీ అయిందని హరీశ్‌రావు ఆరోపించారు. దీంతో కామారెడ్డి జిల్లాకు మంచినీటి సమస్య ఏర్పడిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం గత ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని మూలన పడేసిందని విమర్శించారు. జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని ప్రారంభించి ఏడాది గడిచినా అప్పట్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. మూడేళ్లలో సంగారెడ్డి జిల్లాలో ఒక్క కొత్త రోడ్డైనా వేశారా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆరు లక్షలకు పైగా రేషన్‌కార్డులు ఇచ్చినట్లు అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డే చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి మాత్రం గత ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని చెప్పడం విడ్డూరంగా ఉ ందన్నారు. ప్రజల ముందు అబద్ధాలు చెప్పడం మానుకోవాలని, ఇలాంటి ప్రచారానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఉద్యోగాల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలకు రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు ఇచ్చి తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ సమక్షంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ.. "గన్‌మెన్లు లేకుండా అశోక్‌నగర్‌కు వచ్చే ధైర్యం ఉందా?" అని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. రెండేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. బకాయిలు అందక కళాశాలలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే విద్యార్థుల భవిష్యత్తు ఏమవుతుందని ప్రశ్నించారు. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. రైతుల గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో వరుసగా రైతుబంధు కింద భారీగా నిధులు అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులకు అందాల్సిన సాయాన్ని తగ్గించిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే సుమారు రూ.15 వేల కోట్లు తక్కువగా ఇచ్చారని పేర్కొన్నారు. రుణమాఫీపైనా ముఖ్యమంత్రికి హరీశ్‌రావు సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామానికి వెళ్లి అక్కడి రైతులందరికీ రుణమాఫీ జరిగిందో లేదో తెలుసుకుందామన్నారు. రైతులందరికీ రుణమాఫీ జరిగిందని తేలితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. రుణమాఫీ జరగలేదని రైతులు చెబితే ముఖ్యమంత్రి పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధమా అని హరీశ్‌రావు సవాల్ చేశారు.

# ఇంటికి వచ్చి ఉరికించి కొడతాం

- హద్దు మీరితే ఇంటికొచ్చి గుణపాఠం చెబుతాం
- బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు కాంగ్రెస్ నేతల ఘాటు హెచ్చరిక
- మహేశ్‌కుమార్ గౌడ్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన నేతలు
- పసుపు బోర్డు ఎక్కడ?.. గల్ఫ్ బాధితులకు ఏం చేశారంటూ నిలదీత
- దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్




**హైదరాబాద్, ఆగస్టు 16:** టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరవింద్ తన నోటి దురుసును అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మరోసారి హద్దులు దాటి మాట్లాడితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. మహేశ్‌కుమార్ గౌడ్‌పై అరవింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ స్థాయి నుంచి కష్టపడి రాజకీయాల్లో ఎదిగిన బీసీ నాయకుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదని అనిల్‌కుమార్ యాదవ్ మండిపడ్డారు. తండ్రి పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్.. స్వయంకృషితో ఎదిగిన నాయకుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలని అరవింద్‌ను కాంగ్రెస్ నేతలు నిలదీశారు. గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఎంపీగా ఆయన ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తుంటే అరవింద్ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. డీఎస్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా వచ్చాయో కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ అరవింద్ ఉపయోగిస్తున్న భాష ఎంపీ స్థాయికి తగినట్లుగా లేదని విమర్శించారు. దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి కనీసం కౌన్సిలర్‌గా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. మరోసారి హద్దులు దాటి మాట్లాడితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం తమ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. వ్యక్తిగత దూషణలు, హద్దులు దాటిన వ్యాఖ్యలు కొనసాగితే కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు.

# ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్‌తో కలవను

- పార్టీతో మళ్లీ కలిసి పనిచేసే ప్రసక్తే లేదు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత
- షోకాజు కూడా ఇవ్వకుండానే బయటకు పంపారని ఆవేదన
- కుటుంబ బంధాలు వేరు.. రాజకీయాలు వేరని స్పష్టీకరణ
- వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో పోరాటం



**హైదరాబాద్, ఆగస్టు 16:** "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసే ప్రసక్తే లేదు. కుటుంబ సంబంధాలు వేరు.. రాజకీయాలు వేరు" అని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో రాజకీయంగా కలిసే అవకాశం లేదని తేల్చిచెప్పారు. అదే సమయంలో బీఆర్ఎస్‌ను అధికారంలోకి రాకుండా చేయడమే తమ రాజకీయ సిద్ధాంతం కాదని స్పష్టం చేశారు. ఓ మీడియా ఇంటర్వ్యూలో కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి తనను బయటకు పంపించిన తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం షోకాజు నోటీసు కూడా ఇవ్వకుండా పార్టీ నుంచి పంపించేశారని ఆరోపించారు. సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పార్టీలో పక్కన పెట్టారని పేర్కొన్నారు. అయినప్పటికీ నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని చెప్పారు.

### 'మాది ఆర్ట్ మూవీ కాదు.. కమర్షియల్ మూవీ'

తాను ప్రారంభించిన కొత్త రాజకీయ ప్రయాణానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని కవిత తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు.. కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అంటూ వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ మాదిరిగానే తాను కూడా తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తానని చెప్పారు. కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం తాము పార్టీ పెట్టలేదని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే వంద రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించారు.

### బీసీల కోసం ఢిల్లీ వరకు పోరాటం

సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని కవిత స్పష్టం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయని ఆరోపించారు. బీసీల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఆ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని కవిత జోస్యం చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు చోటుచేసుకుంటాయని, తమ పార్టీ కీలకశక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# రాజగోపాల్ వ్యాఖ్యల్లో తప్పు లేదు: అనిరుధ్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 15:** మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తూ మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనే వ్యక్తి ఒక అగ్నిపర్వతం.. వోల్కానో.. ఆయనకు కోపమొచ్చిందంటే ఒక అగ్నిపర్వతం పేలినట్టు పేలుతది. ఆయన ఎప్పుడూ కూడా మంత్రి పదవి కావాలని కొట్లాడలేదు.. అడగలేదు.. రెండున్నర సంవత్సరాలు అయింది.. అయి ఉంటే అప్పుడే కొట్లాడుతుండే. ఆయన ప్రజల గురించి సమస్యల మీద అడుగుతుండు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడే దాంట్లో తప్పేం లేదు. నేను కూడా సమస్యల గురించి చాలా సార్లు మాట్లాడాను. సమస్యలున్నాయి.. వాటిని పరిష్కరించుకుంటే మా పార్టీకే మంచి పేరొస్తది కదా..కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావాలని మాట్లాడిండు అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



# బేవకూఫ్ ఇప్పుడే చెప్పిన కదా!

### జర్నలిస్టుపై నోరు పారేసుకున్న బీజేపీ ఎంపీ అర్వింద్

### వెంటనే క్షమాపణ చెప్పాలని టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 14:** విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టుపై నిజామాబాద్ బీజేపీ అర్వింద్ నోరు పారేసుకున్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనను ప్రశ్న అడిగిన జర్నలిస్టును ఉద్దేశించి 'బేవకూఫ్' ఇప్పుడే చెప్పిన కదా..! వినా లే..' అంటూ అహంకార ధోరణిలో వ్యాఖ్య లు చేశారు. జర్నలిస్టుపై ఎంపీ అర్వింద్ చేసి న వ్యాఖ్యల వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. జర్నలిస్టులు ఎంపీ అహంకార ధోరణిపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఎంపీ అర్వింద్ జర్నలిస్టుపై అసభ్యకరంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణమే క్షమాపణ చెప్పాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని మండిపడింది. ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పీ రాంచందర్, ప్రధాన కార్యదర్శి బీ బసవపున్నయ్య ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టుపై చేసిన వ్యాఖ్యలను ఎంపీ అర్వింద్ వెంటనే ఉపసంహరించుకోవాలని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# తెలంగాణపై ఏపీ నీటి కుట్రలు

### కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్‌కు లేఖ దుర్మార్గం

### మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్




**హైదరాబాద్, ఆగస్ట్ 15:** తెలంగాణ నీటిపై ఏపీ మళ్లీ కుట్రలు మొదలు పెట్టిందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ చైర్మన్ కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకి లేఖ రాశాడు. ఆయన వాళ్ల రాష్ట్రం గురించి మాట్లాడాలి కానీ తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా రివర్ బేసిన్‌లో ఉన్న ప్రాంతానికి కేవలం 30 టీఎంసీల నీళ్లు మాత్రమే ఇవ్వాలని.. అంటే 30 శాతం మాత్రమే తెలంగాణకు ఇవ్వండి.. మిగితా నీళ్లు మేం తీసుకుపోతం. అంటే 146 టీఎంసీలు మేం తీసుకెళ్తం.. 30 టీఎంసీలు తెలంగాణ వాళ్లకు ఇచ్చేయండి అని.. ఆయన ఎవరు... తెలంగాణ గురించి రాయడానికి నీకు ఎవరు అధికారం ఇచ్చిండన్నారు. 100 శాతం కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాంతాన్ని వదిలిపెట్టి నువ్వు కృష్ణా బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కు కృష్ణా రివర్‌కు 80-90 శాతం నీళ్లు తీసుకుపోతున్నరు. పోతిరెడ్డి పాడు ద్వారా 10 వేల క్యూసెక్కులు అని చెనప్పి 30 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంతంలో నింపుకుంటున్నరని ఆరోపించారు. తెలంగాణకు ఎన్ని నీళ్లు ఇవ్వాలో డిసైడ్ చేయడానికి వాడు ఎవడు..? ఏపీ ఈఎన్‌సీ లేఖ రాసిన రోజే తెలంగాణ ఈఎన్‌సీ కూడా లేఖ రాశాడు. మాకు కృష్ణా నదిపై రిజర్వాయర్లు లేవు, నీటిని ఏపీకి ఇబ్బంది లేకుండా ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ లేఖ రాశాడు.. ఏదుల, నార్లాపూర్ రిజర్వాయర్లు లేవా..? 10 ఏళ్లలో తెలంగాణ నీటిపై లేని కుట్రలు మళ్లీ ఎందుకు మొదలవుతున్నాయి..? తెలంగాణ ప్రభుత్వం చేతకానిది అనే కదా..? ఏపీ మోచేతి కింద బతుకుతుందనే కదా..? తెలంగాణకు అన్యాయం చేసే అధికారులను వదిలిపెట్టము, జాగ్రత్త అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ ఈఎన్‌సీకి లేఖ రాయమని ఎవరు చెప్పారు..? రేవంత్ రెడ్డి చెప్పాడా..? అని అడిగారు.

# వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి దొరకడు

### రాహుల్‌గాంధీ శ్రీరాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడు

### ఓడినా ప్రజలను వీడని నాయకుడంటూ సీఎం రేవంత్ ప్రశంసలు



**సంగారెడ్డి, ఆగస్టు 15:** "వెయ్యి కోట్ల రూపాయలు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు.. నాయకులకు మార్కులు వేస్తే నాకంటే ఆయనకే ఎక్కువ మార్కులు వస్తాయి" అంటూ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. ఎన్నికల్లో ఓడిపోయినా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడిని ఓడించడం సంగారెడ్డి ప్రజల దురదృష్టమని వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జగ్గారెడ్డితో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని శ్రీరాముడిగా భావిస్తే.. జగ్గారెడ్డి ఆయన వెంట నడిచే హనుమంతుడి వంటి వ్యక్తి అని అభివర్ణించారు. పార్టీ పట్ల ఆయనకున్న విధేయత, ప్రజల పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉండటమే నిజమైన నాయకుడి లక్షణమని సీఎం పేర్కొన్నారు. ఆ విషయంలో జగ్గారెడ్డి ముందుంటారని చెప్పారు. "కుటుంబాన్ని కూడా పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తాడు. పరిస్థితులు ఎలా ఉన్నా జగ్గారెడ్డి ప్రజా జీవితంలో ఉండాల్సిందే" అని స్పష్టం చేశారు. జగ్గారెడ్డి ప్రజల సమస్యల విషయంలో వెనక్కి తగ్గే వ్యక్తి కాదని, ప్రజల కోసం ఎంతదూరమైనా వెళ్లే స్వభావం ఆయనదని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. సంగారెడ్డి ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం రాజకీయాలకు అతీతమైనదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ప్రజలకు దూరం కాకుండా అదే ఉత్సాహంతో పనిచేయడం ఆయన ప్రత్యేకతని సీఎం అన్నారు.

## సంపాదకీయం



# హుందాతనం కోల్పోతున్న రాహుల్ గాంధీ!

రాజకీయాల్లో హుందాతనం అవసరం. సమయానుకూలంగా మంచిగా మాట్లాడేలా వ్యవహరించాలి. సమస్యలపై అవగాహన ఉండాలి. అందులోనూ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ అవసరం. ప్రతిపక్ష నేతగా సమర్థత ఉంటేనే రాణిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలాగైనా చెల్లుతుంది. కానీ ప్రతిపక్షనేతగా రాణించాలంటే ప్రజల్లో తన వ్యక్తిత్వం కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. మాటలు, చేతలు అన్నీ హుందాగా ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ ఈ మధ్య మరీ దిగజారి పోయారు. మాటల్లో హుందాతనం లేదు. చేతల్లో అంతకన్నా లేకుండా పోయింది. సర్కస్‌లో జోకర్‌లా, డ్రామాల్లో విదూషకుడిలా ఆయన ప్రవర్తిస్తున్న తీరు జుగుప్స కలిగిస్తోంది. లోక్‌సభలో మాట్లాడాల్సిన సమయంలో మాట్లాడరు. మాట్లాడితే పస ఉండడం లేదు. సమస్యలపై అవగాహన ఉండడం లేదు. విషయంపై పట్టు ఉండడం లేదు. ఇవన్నీ కలగలిపి రాహుల్ గాంధీ విపక్ష నేతగా పూర్తిగా విఫలం అవుతూ వస్తున్నారు. ఇటీవల వరుసగా పార్లమెంట్ సమావేశాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం కూడా రాహుల్ అన్న విషయం మరచిపోరాదు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన ఎంతగా దిగజారిపోయారో అనడానికి నిదర్శనంగా నిలిచాయి. ఆలింగనాలే ప్రధాన మంత్రి మోదీ విదేశీ దౌత్యం అంటూ... లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు..ఆయన ఆహార్యం సామాన్యులకు కూడా వెగటు పుట్టించేలా ఉన్నాయి. అహంకారం హద్దులు దాటి రాహుల్ నోరుజారుతున్నారనడానికి ఇంతకన్నా నిదర్శం అక్కర్లేదు. ఇది ఓ రకంగా భారత ప్రతిష్ఠను దిగజార్చేలా ఉంది. ఇలాంటి ప్రతిపక్ష నేతను గతంలో ఎప్పుడూ చూడలేదని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజం. ఎందుకంటే భారత దౌత్యంపై రాహుల్ చేసినవి దిగజారుడు వ్యాఖ్యలు చూశాక ఇలాంటి ప్రతిపక్ష నేత ఉన్నందుకు దేశ ప్రజలు సిగ్గుపడాలి. ఆయన ప్రవర్తన ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. రాహుల్ వ్యాఖ్యలు విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయి. ఎందుకంటే రాహుల్ అహంకారంతో చేసిన వ్యాఖ్యలు వ్యవహరించిన తీరు పిచ్చిగా మారుతోందనడానికి చెప్పడానికి సిగ్గుపడాల్సిన పనిలేదు. భావి భారత ప్రధాని అని కాంగ్రెస్ శ్రేణులంతా పొగడుతున్న వేళ..ఆయన భాషను, ఆహార్యాన్ని చూస్తుంటే..ఇతనూ ఒక నేతేనా అన్న సందేహం కలుగక మానదు. ఇలాంటి వారిచేతిలో భారత్ పదిలంగా ఉండగలదా అన్న భయం కలుగుతోంది. భారతదేశాన్ని నడపడానికి సుదీర్ఘ అనుభవం కావాలి. పనికిమాలిన నాటకాలు కాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని జోకర్లని పిలవడం, మోడీని, అమిత్ షాలను కట్టగట్టి తిట్టడం పరిధికి మించిన విషయం. రాహుల్ వాడుతోన్న భాష మూర్ఖత్వాన్ని, నిరాశను తెలిజేస్తున్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. అలాగే విదేశాల్లో వివిధ నేతలతో మోడీ ఆలింగనాలపైనా కువ్యాఖ్యలు చేశారు. నిజానికి ఓ ప్రతిపక్షనేతగా ఉన్న వ్యక్తి విదేశీ నాయకులపై రాజకీయ వ్యాఖ్యలు చేసేటప్పుడు గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సి ఉంటుంది. తానొక విపక్షనేతను అన్నది మరచి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు పారాకాష్టగా చూడాలి. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర తరవాత ఆయన నాయకత్వం పట్ల ప్రజల్లో కొంత విశ్వసనీయతను పెంపొందించిందనడంలో సందేహం లేదు. ఆ యాత్రతో ఆయన ప్రజల మనిషిగా మారడానికి తపించారు. అయితే సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌ను మళ్లీ ఒక కుటుంబ వ్యవస్థగా మార్చేయడంతో భారత్ జోడో యాత్ర నాటి ఆదర్శం లేకుండా పోయింది. ఇప్పుడు జన్‌జి అంటూ మాట్లాడుతున్న రాహుల్ వారికి పార్టీలో అవకాశం ఇవ్వలేక పోయారు. ప్రియాంకగాంధీని వయనాడ్ నుంచి లోక్‌సభకు ఎన్నిక చేయించుకున్నారు. తల్లి సోనియాను రాజ్యసభకు పంపారు. తాను రాయబరేలి నుంచి ఎన్నికయ్యారు. ఇది కుటుంబ పార్టీ అనకుండా ఎలా ఉండగలం. వృద్దనేతలంతా కాంగ్రెస్‌లో పాతుకు పోయారు. యువ నేతలను దరిచేరనీయకుండా చూసుకుంటున్నారు. వీరు జన్‌జీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. తాను దక్షిణాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని, తన సోదరుడు ఉత్తరాదికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, తద్వారా తాము ఈ సువిశాల దేశాన్ని సమైక్యం చేస్తున్నామని ప్రియాంక చెప్పుకోవడం సిగ్గుచేటు. 2024 సార్వత్రిక ఎన్నికలలో 99 సీట్లు గెలుచుకుని కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించడంతో రాహుల్ విధేయులు ఆయనను కాబోయే ప్రధానమంత్రి అని కీర్తించడం ప్రారంభించారు. కొందరు మేధావులు, పాత్రికేయులు కూడా ఆ కీర్తనకు వంతపాడుతూ వచ్చారు. రెండు సంవత్సరాల తరువాత ఇప్పుడు వెనుతిరిగి చూస్తే అంత సీన్ రాహుల్‌కు లేదని అనిపిస్తోంది. తాజాగా రాహుల్ చేష్టలు, వ్యాఖ్యలు ఆయనలో నాయకత్వ పటిమ లేదని నిరూపించాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ క్రమంగా వెనుకపడిపోతోంది. కాంగ్రెస్ పతనాన్ని రాహుల్‌గాంధీ నిలువరించలేక పోతున్నారు. ప్రధానమంత్రి పదవి విషయంలో నరేంద్ర మోదీతో పోలిస్తే .. రాహుల్‌లో క్రమశిక్షణ, హుందాతనం, విద్యార్హతలు, నాయకత్వ నైపుణ్యాలు ఎక్కడా కనిపించవు. సమయానుకూలంగా ఏదో ఓ సమస్యపై మాట్లాడడం, విదేశాలకు చెక్కేయడం అలవాటు చేసుకున్నారు. అక్కడా భారత పరువు పోయేలా మాట్లాడడం కూడా అలవాటు చేసుకున్నారు. 'ఓటు చోరీ'పై ఇలాగే చేశారు. ప్రతిపక్ష నేతగా ప్రధాని కన్నా ఎక్కువ కష్టపడాలి. ఎక్కువగా కృషి చేయాలి. యూపీఏ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో రాహుల్ మంత్రిపదవిని చేపట్టేందుకు అంగీకరించలేదు. దీంతో ఆయనకు అధికారంలో ఉండడం ఎలా అన్నది కూడా తెలియదు. ప్రస్తుత కల్లోల అంతర్జాతీయ పరిస్థితులలో ఈ సువిశాల దేశానికి ప్రభావశీల ప్రధానమంత్రి కాగలరని భారతీయ ఓటర్లు మాత్రం ఎలా నమ్ముతారు. గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోలేని రాహుల్, ఇప్పటికీ పదేపదే అవే తప్పులు చేయడంతో పాటు, రాజకీయ హుందాను కోల్పోతున్నారు. 2019లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ నిర్వహించిన 'చౌకీదార్ చోర్' ప్రచారం ఘోరంగా విఫలమవడమే కాకుండా కాంగ్రెస్‌నే ఎదురు దెబ్బతీసింది. అయినప్పటికీ పాలనా వైఫల్యాలు లేదా తన సొంత పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడంపై దృష్టి పెట్టకుండా ప్రధాన మంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా మరింతగా దిగజారిన నేతగా ప్రజల్లో చులకన భావం మూటకట్టుకుంటున్నారు. ఇలాంటి వ్యక్తి నిజసానికి ప్రతిపక్ష నేతగా కూడా పనికిరాడు. ఇక ప్రధానిగా కావాలనుకంటున్న ఇతనికి వందిమాగధులు చేస్తున్న పొగడ్తలతో ఉబ్బిపోవడం తప్ప మరోటి తెలియడం లేదు. స్వయం ప్రకటితంగా ఇక తానే భావి ప్రధాని అనుకోవడంతో వచ్చిన మానసిక వైకల్యంగా చూడాలి. వీటిని అధిగమించితే తప్ప సమర్థనేతగా రాహుల్ రాణించడం కష్టం.

# వికసిత భారత్‌కు 'సప్తధార'!

- ప్రపంచ నాయకత్వమే భారత్ లక్ష్యం
- తయారీ నుంచి రక్షణ దాకా ఏడు రంగాలపై గురి
- యువశక్తి.. సాంకేతికతతో సరికొత్త ప్రగతి పథం
- జనగణనలో కచ్చితమైన సమాచారమివ్వాలని పిలుపు
- స్వయం సమృద్ధితో 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్
- ఎర్రకోట నుంచి భవిష్యత్ భారతానికి మోదీ దిశానిర్దేశం





**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రపంచస్థాయి నాయకత్వం వహించే శక్తి, సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తయారీ నుంచి వ్యవసాయం వరకు, సాంకేతికత నుంచి రక్షణ వరకు ప్రతి రంగంలోనూ ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యమని ప్రకటించారు. 2047 నాటికి సంపూర్ణ స్వయంసమృద్ధితో కూడిన 'వికసిత భారత్' నిర్మాణానికి 'సప్తధార' పేరుతో ఏడు కీలక రంగాల కార్యాచరణను దేశం ముందుంచారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై వరుసగా 13వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మోదీ జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత్ ఇక చిన్న లక్ష్యాలతో సంతృప్తి చెందే దేశం కాదని, పెద్ద కలలు.. ఉన్నత లక్ష్యాలతో ప్రపంచానికి దిశానిర్దేశం చేసే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. దేశ యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు భారీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మోదీ ప్రకటించారు. కోటి మంది యువతకు కృత్రిమ మేధ నైపుణ్యాల్లో శిక్షణతో పాటు పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు యువతకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు.

### జనగణనకు ఓ గంట ఇవ్వండి

దేశంలో జరుగుతున్న జనగణనలో యువత చురుగ్గా భాగస్వాములు కావాలని ప్రధాని కోరారు. "దేశం కోసం ఒక గంట లేదా రెండు గంటలు కేటాయించండి. ప్రతి ఇంట్లో జనగణనపై అవగాహన కల్పించండి" అని పిలుపునిచ్చారు. జనగణన కేవలం జనాభా లెక్కల ప్రక్రియ కాదని, ప్రజలు ఇచ్చే సమాచారం ఆధారంగానే భవిష్యత్ జాతీయ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతాయని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ కచ్చితమైన సమాచారం ఇవ్వాలని కోరారు.

### దేశ ప్రగతికి ఏడు ధారలు

వికసిత భారత్ నిర్మాణానికి తయారీ, వ్యవసాయం-ఆహార భద్రత, సాంకేతికత-ఆవిష్కరణలు, మౌలిక వసతులు, రక్షణ, హరిత-నీలి ఆర్థిక వ్యవస్థ, భారతీయ సాంస్కృతిక ప్రభావం అనే ఏడు రంగాలను 'సప్తధార'గా ప్రధాని ప్రకటించారు. తయారీ రంగంలో కేవలం విడిభాగాల ఉత్పత్తికి పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తులను భారత్‌లోనే తయారు చేయాలని పిలుపునిచ్చారు. ధర, నాణ్యత, భారీ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక భాగస్వామిగా ఎదగాలన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడంతో పాటు దీర్ఘకాలిక ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. సాంకేతిక రంగంలో డేటా కేంద్రాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించాలని మోదీ స్పష్టం చేశారు. డ్రోన్లు, ప్రతిదాడి డ్రోన్ వ్యవస్థలు సహా అత్యాధునిక రక్షణ సాంకేతికతలను దేశీయంగా అభివృద్ధి చేయాలని సూచించారు. దేశ భద్రతకు స్వయం సమృద్ధ రక్షణ వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. హరిత ఇంధనం, అణు విద్యుత్, సౌరశక్తి, హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై భారత్ మరింత వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. వంద గిగావాట్ల అణు ఇంధన సామర్థ్యాన్ని సాధించడం లక్ష్యమన్నారు.

### చిప్ నుంచి హైడ్రోజన్ రైలు వరకు

సాంకేతిక ప్రపంచంలో సెమీకండక్టర్ చిప్‌ల ప్రాధాన్యాన్ని భారత్ గుర్తించిందని మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని, రైల్వే విద్యుదీకరణను వేగంగా విస్తరించామని తెలిపారు. దేశంలో 50 లక్షల ఇళ్లకు సౌర విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు.

### 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు

తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రధాని పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులు ఒకే సంకల్పంతో ముందుకు సాగితే దేశ ప్రగతిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. స్థానిక ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్వదేశీ తయారీకి మరింత బలం చేకూర్చాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మహిళా ప్రాతినిధ్యానికి సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. రాజకీయ ఘనత ఎవరు తీసుకున్నా అభ్యంతరం లేదని, మహిళలకు తగిన ప్రాతినిధ్యం దక్కాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

### ఎర్రకోటపై మువ్వన్నెల రెపరెపలు

అంతకుముందు రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోదీ ఎర్రకోటకు చేరుకుని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాయుసేన హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం వరుసగా 13వసారి.

### వేడుకలకు రాహుల్, ఖర్గే దూరం

ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. గతంలో సీటింగ్, ఇతర ప్రొటోకాల్ అంశాలపై కాంగ్రెస్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో వారి గైర్హాజరు మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది.

# పాక్ ఉగ్రవాద సంస్థతో లింకులు

### బెంగుళూరులో బెంగాల్ యువకుడి అరెస్ట్



**బెంగళూరు, ఆగస్ట్ 15:** బెంగళూరులో అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ 25 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడికి ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర పరగణాల జిల్లాకు చెందిన అసఫుల్ మల్లిక్ బెంగళూరులోని జిగణి పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థలో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బొమ్మసంద్ర పారిశ్రామిక ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో మల్లిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ÷ూకిస్థాన్ సైన్యం ముస్లింలపై దాడులకు పాల్పడుతోందనే భావనతో తాను ఆగ్రహానికి గురైనట్లు మల్లిక్ చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో, ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో పాకిస్థాన్ వైఖరిపైనా అతడు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. భారతదేశంలో ముస్లింలకు ఇబ్బందులు ఎదురైతే ప్రతీకారం తీర్చుకోవాలని అతడిని ప్రేరేపించినట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ÷ళిస్‌బుక్ ద్వారా అఎ÷-గానిస్థాన్‌కు చెందిన ఇమ్రాన్ హైదర్ అనే వ్యక్తితో మల్లిక్ పరిచయం పెంచుకున్నట్లు వెల్లడైంది. అఎ÷-గాన్‌కు చెందిన టీటీపీ ఉగ్రసంస్థ హ్యాండ్లర్లతో అతడు తరచూ సంప్రదింపులు జరుపుతున్నట్టు తేలింది. భారత్, పాకిస్థాన్‌లో దాడులకు వారు ప్రణాళికలు రచించినట్టు తెలుస్తోంది. అఎ÷-గాన్‌కు వెళ్లి ఉగ్రసంస్థలో చేరడానికి కూడా అతడు సిద్ధమవుతున్నట్టు పోలీసులు గుర్తించారు.



# టీహెచ్‌డీసీ సొరంగ ప్రమాదం

### ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య

**ఉత్తరాఖండ్:** చమోలి జిల్లా పిపల్‌కోటిలోని టీహెచ్‌డీసీ సొరంగంలో నిన్న (శుక్రవారం) భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బిర్హి నది సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి పెద్దఎత్తున వరదనీరు, శిథిలాలు వచ్చి చేరాయి. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారి కోసం సహాయక బృందాలను అధికారులు రంగంలోకి దించారు. నిన్నటి నుంచి భారీగా చేరిన నీరు, శిథిలాలను తొలగిస్తూ.. నేడు మరో మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. మరోవైపు, శిథిలాల కింద చిక్కుకుపోయిన మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈరోజు ఉదయం స్పందించారు. టీహెచ్‌డీసీ సొరంగంలోకి అకస్మాత్తుగా శిథిలాలు, నీరు చేరడంతో విధుల్లో ఉన్న కార్మికులు చిక్కుకుపోయారని తెలిపారు. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా.. చిక్కుకుపోయిన కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వ జిల్లా యంత్రాంగంతో సహా అన్ని ఏజెన్సీలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకునేందుకు సమగ్ర దర్యాప్తు జరుగుతోందని సీఎం పుష్కర్ సింగ్ ధామి చెప్పారు. ఏ నిర్మాణ ప్రాజెక్టులోనైనా పని చేసే సిబ్బంది భద్రతే తొలి ప్రాధాన్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారమే ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కాగా, సొరంగం లోపల భారీగా చేరిన నీరు, బురద కారణంగా సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు చెబుతున్నారు.

చురకలు



## త్యాగధనుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట, ఆగస్టు,15:**

నారాయణపేట: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండాకు గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS నారాయణపేట జిల్లా ప్రజలకు, జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు తమ ప్రాణాలను, జీవితాలను త్యాగం చేయడం వల్లే నేడు దేశ ప్రజలంతా స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వతంత్రంగా జీవిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ స్మరించుకోవాలని సూచించారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ సేవకు కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



#### ప్రజా సేవే పోలీసుల ప్రధాన లక్ష్యం

జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తి, ఉత్సాహంతో మరింత సమర్థవంతంగా పనిచేసి నారాయణపేట జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, నిజాయితీతో, క్రమశిక్షణతో నిర్వర్తించాలని తెలిపారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని, వారికి చట్టపరంగా తక్షణ సహాయం అందిస్తూ ప్రజల ఆదరాభిమానాలను పొందాలని సూచించారు.తెలంగాణ పోలీస్ శాఖ దేశంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న పోలీస్ వ్యవస్థగా మంచి గుర్తింపు పొందిందని ఎస్పీ తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో అలవర్చుకుని విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.సైబర్ నేరాలు, ఆధునిక నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్నందున పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికత, ఆధునిక పోలీసింగ్ విధానాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటూ, ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, వారి సమస్యలను పరిష్కరించడం, శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.ప్రతి ఉద్యోగి తన విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్ఐలు నరసింహ, విజయ్ భాస్కర్, ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.




**నిజామాబాద్ ఆగస్టు15:**

నిజామాబాద్ పట్టణంలో సుభాష్ నగర్ లో సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనం లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగినాయి. పతాకావిష్కరణ కార్యక్రమంలో అధ్యక్షుడు K.నారాయణరెడ్డి, కార్యదర్శి డా.విజయకుమార్, కోశాధికారి భూమయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు మరియు సభ్యులు హాజరయ్యారు. అనంతరం సమావేశపు హాలులో ఏర్పాటుచేసిన అల్పాహారనంతరం , స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో సభను ముగించారు.

## సిద్దిపేటలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట, ఆగస్టు 15:** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు లక్ష్యంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.రైతు భరోసా కింద జిల్లాలో 3.25 లక్షల మంది రైతులకు రూ.1,476 కోట్లు జమ చేశామని, రైతు బీమా కింద 3,104 కుటుంబాలకు రూ.155 కోట్లు అందించామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి , సన్నబియ్యం, మహిళా శక్తి, వడ్డీలేని రుణాలు తదితర పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజలు, అధికారులు, పోలీసు, వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రశ్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





## ములుగు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

### మంత్రి సీతక్క



**ములుగు, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీతో పాటు చేయూత పింఛన్లను మరింత మంది అర్హులకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 16న మేడారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాతో పాటు వైద్యం, విద్య, సాగునీరు, తాగునీరు, రహదారులు, గిరిజన సంక్షేమం, పర్యాటక రంగాల్లో జిల్లాలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు సీతక్క వెల్లడించారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## అభివృద్ధి–సంక్షేమంలో ఖమ్మం జిల్లా ముందడుగు

- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతిని వివరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, ఆగస్టు 15:**

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్యం, సాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, మహిళా సాధికారత, రహదారులు తదితర రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు.జిల్లాలో రైతు భరోసా కింద 3,41,913 మంది రైతులకు రూ.427.97 కోట్లు, పంట రుణమాఫీ కింద 1,31,760 మందికి రూ.912.10 కోట్లు అందించగా, రైతు బీమా ద్వారా 803 రైతు కుటుంబాలకు రూ.40.15 కోట్లు అందించినట్లు తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుతో పాటు రైతులకు విత్తనాల పంపిణీ, ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ



కొనసాగుతోందన్నారు.విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలల్లో 66,882 మంది విద్యార్థులు నమోదయ్యారని, ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. వైద్యరంగంలో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ భవనం పూర్తి చేయడంతో పాటు జిల్లాలో ఆసుపత్రుల ఆధునీకరణకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తొలి విడతలో 16,243 ఇళ్లు మంజూరు చేయగా, 10,396 ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులకు రూ.454.97 కోట్ల ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. రెండో విడతలో మరో 10,400 గృహాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.4,706.52 కోట్లతో 218 పనులు చేపట్టగా, రూ.1,583 కోట్లతో కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి నాలుగు వరుసల పనులు పూర్తయ్యాయి. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి నాలుగు వరుసల పనులు కొనసాగుతున్నాయి.మహిళా సంఘాలకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామీణాభివృద్ధి, విద్యుత్, సాగునీరు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమం–అభివృద్ధిని సమన్వయం చేస్తూ ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ లో సంక్షేమం–అభివృద్ధికి పెద్దపీట

### ప్రభుత్వ సలహా దారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ

**ఆదిలాబాద్, ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో పాటు, అర్హులైన మహిళలకు రూ.500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 2,558 మందికి రూ.8.75 కోట్లతో వైద్య సేవలు అందించగా, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 21,767 ఇళ్లు మంజూరు చేశారు. రైతు భరోసా కింద 1.61 లక్షల మంది రైతులకు రూ.327.92 కోట్లు జమ చేశారు. వ్యవసాయం, విద్యుత్, వైద్యం, గ్రామీణాభివృద్ధి, మహిళా సంఘాలు, జల సంరక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## రాజన్న సిరిసిల్ల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 15 ::** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ, ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించి పనులను వేగంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళా శక్తి చీరలు, పాఠశాల యూనిఫాంల ఆర్డర్ల ద్వారా వేలాది నేత, మరమగ్గాల కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు.జిల్లాలో 9,086 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 3,759 గృహాలు పూర్తయ్యాయని, నిర్మాణాలకు రూ.159.59 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆసరా పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు.సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, రైతు భరోసా, రుణమాఫీ, పంటల మార్పిడి, ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహంతో పాటు విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి, వేములవాడ–సిరిసిల్ల పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.



## ఉత్తమ వైద్యాధికారిగా డా. ఎం. మనోజ్ రెడ్డి



**ముషీరాబాద్, ఆగస్టు 15 :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉత్తమ వైద్యాధికారిగా డా. ఎం. మనోజ్ రెడ్డి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు.ముషీరాబాద్ UPHCలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డా. ఎం. మనోజ్ రెడ్డి వైద్య సేవల్లో విశేషంగా కృషి చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.డా. మనోజ్ రెడ్డి ఇప్పటివరకు మొత్తం 7 అవార్డులను అందుకున్నారు. వీటిలో 3 కలెక్టర్ అవార్డులు ఉండటం విశేషం. గతంలో అనుదీప్ దురిశెట్టి, హరి చందన, తాజాగా డా. ప్రియాంక ఆల చేతుల మీదుగా కలెక్టర్ అవార్డులను అందుకున్నారు.వరుసగా లభిస్తున్న ఈ పురస్కారాలు తన వైద్య సేవలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని డా. మనోజ్ రెడ్డి తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## ఘనంగా జాతీయ పతాక ఆవిష్కరణ

**తాండూర్ మున్సిపల్, ఆగస్టు,15:**

తాండూర్ :80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్ పటేల్ అసోసియేషన్ – తాండూర్, బీసీ సంఘం – తాండూర్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ చౌక్ వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ కందుకూరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకొని ఘనంగా నివాళులర్పించారు.రాజ్‌కుమార్ కందుకూరి మాట్లాడుతూ, “ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ. కుల, మత, రాజకీయాలకు అతీతంగా దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత. స్వాతంత్ర్య ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి అందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యానికి సార్థకత చేకూరుతుంది” అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్దార్ పటేల్ అసోసియేషన్, బీసీ సంఘం నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## కొడంగల్ నూతన సీఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన- మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్



**ఆగస్టు,15:**
**కొడంగల్:** 15ఆగస్టు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ నూతనంగా నియమితులైనటువంటి కొడంగల్ సీఐ చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది...

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- 'తెలంగాణ రైజింగ్–2047' విజన్ తో అన్ని రంగాల్లో ముందుకు: మంత్రి మహమ్మద్ అజారుద్దీన్



**జగిత్యాల, ఆగస్టు 15:** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దార్శనిక నాయకత్వంలో 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే కాకుండా ప్రపంచస్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగిత్యాల పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ గీతం 'వందేమాతరం' ఆలాపనతో కార్యక్రమం ప్రారంభమైంది.అనంతరం మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## నిజామాబాద్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 15:** జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల స్టాళ్లను సుదర్శన్ రెడ్డి సందర్శించి, శాఖల శకటాల ప్రదర్శనను తిలకించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, పతకాలు సాధించిన పోలీసులకు మెడల్స్ అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్. భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, మేయర్ ఉమారాణి, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్యతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వి ల్గొన్నారు.

## సిద్దిపేట కలెక్టరేట్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



**సిద్దిపేట, ఆగస్టు 15:**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలు, ఆదర్శాలను అనుసరించి సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సేవలో అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పూడూర్ తాహేసిల్దార్ కార్యాలయ ఆవరణ లో జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన -తాహేసిల్దార్ విజయకుమార్



**పూడూర్ మండలం,ఆగస్టు,15:**
80 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తాహేసిల్దార్ విజయకుమార్ జాతీయ పతాక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అయిన జిల్లా పంచాయతీ అధికారి ఎంపిడీఓ,ఎంఇఓ మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎంపీఓ, పిఏసీఎస్ చెర్మెన్, పూడూరు గ్రామ సర్పంచ్ మరియు ఇతర ప్రజాప్రతినిధులు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనడం జరిగింది

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

**మెదక్ ఆగస్టు15:**
త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి మరియు మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు వివేక్ వెంకట స్వామి

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు మెదక్ ఆగస్టు**

మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగారాష్ట్ర మంత్రి వివేక్ వెంకట స్వామి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మీదట, పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక, అటవీ, విద్యా, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ, నీటి పారుదల, సమగ్ర శిక్ష అభియాన్ తదితర శాఖల ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ ను సందర్శించారు. . ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పతకాలు పొందిన పోలీసులకు మెడల్స్ బహూకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను, వారి కుటుంబీకులను ఘనంగా సన్మానించారు. పంద్రాగస్టు వేడుక సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఎదనిండా దేశ భక్తిని నింపుకుని జాతీయ స్ఫూర్తి పెంపొందేలా ఆకట్టుకునే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. పాఠశాలల చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి మంత్రి వివేక్ వెంకట స్వామి ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,మెదక్ ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



# స్వేచ్ఛా గళం.. హక్కుల కదం.. యువతే భవిష్యత్ బలం!

- మన హక్కులు.. మన భవిష్యత్' నినాదంతో హనుమకొండలో ఘనంగా రైట్స్ వాక్
- విద్య, వైద్యం, సమానత్వం ప్రతి పౌరుడి హక్కు...దుగ్గంపూడి రంజిత్ రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 15 : :**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మన హక్కులు.. మన భవిష్యత్' అనే నినాదంతో హనుమకొండలో హక్కుల కోసం యువత గొంతెత్తింది. రైట్ టు ఇండిపెండెన్స్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ రైట్స్ వాక్ నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి, సామాజిక సమానత్వం, పౌర హక్కులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం అంటే కేవలం జెండా ఎగురవేయడం, వేడుకలు జరుపుకోవడం మాత్రమే కాదని.. ప్రతి పౌరుడికి సమానంగా హక్కులు, అవకాశాలు అందినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం చేకూరుతుందన్నారు.దేశంలో ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం సమానంగా అందుబాటులోకి వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాధించినట్లవుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, సమానత్వం దయగా లభించేవి కావని.. ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులని స్పష్టం చేశారు.యువత దేశానికి అతిపెద్ద బలమని పేర్కొన్న రంజిత్ రెడ్డి యువత చెడు వ్యసనాలు, చెడు మార్గాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, సమాజం, దేశం గర్వపడేలా జీవించాలని పిలుపునిచ్చారు.ఈరోజు యువత వేసే ప్రతి అడుగు.. రేపటి భారతదేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. హక్కుల గురించి తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని అన్నారు.రైట్స్ వాక్‌లో పాల్గొన్న యువత 'విద్య, వైద్యం, సమానత్వం ప్రతి పౌరుడి హక్కు', 'మన హక్కులు.. మన భవిష్యత్' అంటూ నినాదాలతో హనుమకొండ వీధుల్లో హక్కుల చైతన్యాన్ని నింపారు.ఈ సందర్భంగా సుమారు 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శిస్తూ యువత దేశభక్తిని చాటారు. ఏకశిల పార్క్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# త్యాగాల స్ఫూర్తితో.. తిరంగాకు ఘన వందనం...

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు
- పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**హన్మకొండ, ఆగస్టు 15 : :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వేడుకలకు ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శాలువాలతో సత్కరించి ఆహ్వానించారు.అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు, అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలను మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆసక్తిగా వీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ.. వారి ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలనే సందేశాన్ని ఈ వేడుకలు చాటాయి.అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ సేవలకు గుర్తింపు లభించడంతో అధికారులు, ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, నగర ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్వేచ్ఛా గగనంలో.. జెండా రెపరెపలు...

- స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- క్యాంపు కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**హనుమకొండ, ఆగస్టు 15 : :** హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలు నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే మనం ఈ రోజు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని.. ఆ స్వేచ్ఛకు విలువనిస్తూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అందించే నిజమైన నివాళి అని, దేశం కోసం మనం చేసే ప్రతి మంచి పని భారత మాతకు అంకితమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొని జాతీయ పతాకానికి వందనం చేశారు. క్యాంపు కార్యాలయం ఆవరణలో దేశభక్తి నినాదాలు, జాతీయ గీతంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

# స్వాతంత్ర్య వేడుకల్లో మానవత్వపు మువ్వన్నెల జెండా...

- వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా గడిపి జాతీయ జెండాను ఆవిష్కరించిన డాక్టర్ అనితా రెడ్డి
- దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగమే మన స్వేచ్ఛకు పునాది
- స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో దేశ సేవకు ప్రతి ఒక్కరూ అంకితం కావాలి



**హన్మకొండ, ఆగస్టు 15 : :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశభక్తి, మానవత్వం, సమానత్వం, సామాజిక బాధ్యతను చాటేలా అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి పలు సేవా కేంద్రాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.శనివారం స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమం, లార్డ్ వృద్ధాశ్రమం, బాలుర దివ్యాంగుల ఆశ్రమం, వృద్ధుల డే కేర్ సెంటర్‌లలో జాతీయ జెండాను ఆవిష్కరించి, అక్కడి వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులతో ఆత్మీయంగా గడిపారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో కూడా ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని.. ప్రతి పౌరుడు గౌరవంగా, స్వేచ్ఛగా, సమాన హక్కులతో జీవించే సమాజాన్ని నిర్మించడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని అన్నారు.దేశం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి భారతీయుడు ఎల్లప్పుడూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. వారి త్యాగాల ఫలితంగానే మనం ఈ రోజు స్వేచ్ఛా వాయువులను పీలుస్తున్నామని, ఆ స్వేచ్ఛకు విలువనిస్తూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.మహనీయులు కలలుగన్న భారతదేశం కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా కాకుండా సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.సమాజంలోని వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, బలహీన వర్గాలు, అణగారిన వర్గాల పట్ల ప్రతి ఒక్కరూ ఆప్యాయత, బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. మన చుట్టూ ఉన్న ఒకరి జీవితంలోనైనా వెలుగు నింపగలిగితే అదే నిజమైన దేశసేవని పేర్కొన్నారు.దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, కులం, మతం, ప్రాంతం, భాషలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. యువత మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, సేవ, క్రమశిక్షణ, నైతిక విలువలతో దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలని కోరారు.జాతీయ జెండా మనకు స్వేచ్ఛను మాత్రమే గుర్తు చేయదని, దేశం పట్ల మన బాధ్యతను కూడా గుర్తు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరి హృదయంలో దేశభక్తి, చేతల్లో సేవాభావం, ఆలోచనల్లో సమానత్వం ఉంటేనే స్వాతంత్ర్య సమరయోధుల కలల భారతదేశం సాకారం అవుతుందని డాక్టర్ అనితా రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ అనితా రెడ్డితో పాటు సుచరిత వసుధ, హరిత, నాగరాణి, నరేష్, వివిధ విభాగాల ప్రతినిధులు, సిబ్బంది, ఆశ్రమాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య స్ఫూర్తితో.. ప్రజాస్వామ్య పరిరక్షణకు పునరంకితం కావాలి

- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- హనుమకొండ డీసీసీ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**హనుమకొండ, ఆగస్టు 15 : :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకలకు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీతో పాటు ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వేచ్ఛా భారతాన్ని, దేశ సమగ్రతను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. దేశాన్ని ఐక్యంగా, సమగ్రంగా ఉంచడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని, యువత రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని అర్థం చేసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సంక్షేమ ప్రభుత్వ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా మరింత అంకితభావంతో పనిచేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కోరారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, సమాజంలోని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా పనిచేయడమే స్వాతంత్ర్య స్ఫూర్తికి నిజమైన అర్థమని తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాకు వందనం చేసి దేశభక్తి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, ఎండి. అజీజ్ ఖాన్, టీపీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కూచన రవళి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, వివిధ డివిజన్లు, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సూర్యాపేట సమగ్రాభివృద్ధే లక్ష్యం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట, ఆగస్టు 15:** రాజకీయాలకు అతీతంగా సూర్యాపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నూతన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ పాల్గొన్నారు.జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా 5.68 కోట్ల ఉచిత మహిళా ప్రయాణాలు జరిగాయని, గృహజ్యోతి ద్వారా 1.91 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కింద 12,868 గృహాలు కేటాయించగా 7,928 మంజూరయ్యాయని పేర్కొన్నారు. 3.72 లక్షలకుపైగా





కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు.రైతు భరోసా కింద 2.90 లక్షలకుపైగా రైతులకు రూ.364 కోట్లకుపైగా జమ చేశామని తెలిపారు. జిల్లాలో సాగునీటి వసతుల విస్తరణకు ముక్త్యాల, జానపాడు, రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకాలతో పాటు కాలువల ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.విద్య, వైద్యం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, శాంతిభద్రతలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతో సూర్యాపేటను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ
- స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాలు

**సంగారెడ్డి, ఆగస్టు 15:** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి అందజేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి ఉపాధి, వ్యాపార రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల దేశభక్తి, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్,



అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యం

## ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



**పెద్దపల్లి, ఆగస్టు 15::** ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.జిల్లాలో 30,909 కొత్త రేషన్ కార్డులతో 88,357 మందికి ప్రయోజనం కల్పించామని, రైతు భరోసా కింద 1,53,582 మంది రైతులకు రూ.161.38 కోట్లు, గృహజ్యోతి ద్వారా 1,40,116 కుటుంబాలకు రూ.141.64 కోట్ల సబ్సిడీ అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 5,982 మందికి రూ.135 కోట్ల సహాయం అందించగా, మరో 5,250 ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు.పెద్దపల్లి ఆర్టీసీ బస్ డిపోకు రూ.8.40 కోట్లు, నాలుగు వరుసల బైపాస్ రోడ్డుకు రూ.82 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కోకాకోలా సంస్థ రూ.700 కోట్లకు పైగా పెట్టుబడితో జిల్లాలో పరిశ్రమ ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మల్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నిర్మల్, ఆగస్టు 15:** ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ విప్ వేముల వీరేశం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీస్ పరేడ్ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయడంతో పాటు మహిళా సంఘాలకు రూ.50 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

# దౌల్తాబాద్ PHC లో జెండా ఎగురవేస్తున్న వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని.




**దౌల్తాబాద్ మండలం, ఆగస్టు,15:** దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 80 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకన్నీ ఎగరవేస్తున్న డాక్టర్. అమూల్య ప్రియదర్శిని, ఈ కార్యక్రమంలో స్థానికులు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబాబాద్ అభివృద్ధే లక్ష్యం

**మహబూబాబాద్, ఆగస్టు 15::** తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో పేర్కొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 10,651 ఇళ్లు కేటాయించగా, ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో 3,685 ఇళ్ల లక్ష్యాన్ని పూర్తిచేసి రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఖాతాల్లో రూ.234 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.వైద్యం, విద్య, భూ సర్వే, సంక్షేమ రంగాల్లో పలు కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. జిల్లాలో 1,044 పాఠశాలల్లో 94,973 మంది విద్యార్థులు చదువుతున్నారని, పదో తరగతి ఫలితాల్లో 98.81 శాతంతో రాష్ట్రంలో ఐదో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. గంగారం ఆకాంక్షిత మండలం జాతీయ స్థాయి డెల్టా ర్యాంకింగ్‌లో మొదటి స్థానం సాధించడంతో రూ.3 కోట్ల అవార్డు నిధులు మంజూరైనట్లు తెలిపారు.

చురకలు



## కరీంనగర్ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: మంత్రి అడ్లూరి





**కరీంనగర్ ఆగస్టు15:**
కరీంనగర్: 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. జిల్లాలో మహాలక్ష్మి , గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, సన్నబియ్యం, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళా సాధికారత, గ్రామీణ, పట్టణాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: విప్ బీర్ల ఐలయ్య



**జనగామ, ఆగస్టు 15,::** ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. జనగామ కలెక్టరేట్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.'తెలంగాణ రైజింగ్–2047' లక్ష్యంతో జిల్లాలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతు భరోసా కింద 1.85 లక్షల మంది రైతులకు రూ.233.10 కోట్లు, ధాన్యం కొనుగోలుకు రూ.591.59 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ పథకంలో 5,756 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.అనంతరం ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు అందజేసి, 30 మంది మహిళలకు కుట్టుమిషన్లు, 25 మంది దివ్యాంగులకు సహాయ ఉపకరణాలతో కూడిన వాహనాలను పంపిణీ చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపల్లిలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా

- గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ స్వాతి మాణిక్యం గౌడ్ జెండా ఆవిష్కరణ
- ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, యువకులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



**షాబాద్ ఆగస్టు 15::**
షాబాద్ మండలం తాళ్లపల్లి గ్రామంలో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ కందికంటి స్వాతి మాణిక్యం గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఉప సర్పంచ్ ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్య విలువలను కాపాడుకుంటూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి, వార్డు మెంబర్లు, యువజన నాయకులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యం

### సంక్షేమం–అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**మంచిర్యాల, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.



రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా శక్తి, విద్య, వైద్యం, ఉపాధి కల్పన, నీటిపారుదల, పురపాలక అభివృద్ధి తదితర రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో రైతులకు రుణమాఫీ, రైతు భరోసా ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోళ్లు చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలతో పాటు వైద్య రంగంలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలను విస్తరిస్తున్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాల సంక్షేమంతో మంచిర్యాల జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## దేశభక్తి, కర్తవ్యనిష్ఠతో ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అంకితం

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS




**వికారాబాద్, ఆగస్టు,15:**
వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం (DPO)లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS జాతీయ జెండాను ఎగురవేసి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వికారాబాద్ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం అపారమైన త్యాగాలు చేసి, తమ ప్రాణాలను సైతం అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు ఆమె ఘన నివాళులు అర్పించారు.సమావేశాన్ని ఉద్దేశించి ఎస్పీ గారు మాట్లాడుతూ, "ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం. వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వర్తించాలి" అని అన్నారు.వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, రోడ్డు భద్రత మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, జవాబుదారీతనం మరియు అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

### సేవా పతకాల ప్రదానం

అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS విధుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ప్రదానం చేసి, వారి విజయాన్ని అభినందించారు.సేవా పతకాలు అందుకున్న వారిలో M. Chander – ARSI 2340, R. Venkatayya – ARHC 6693, N. Ramulu – ARHC 3489, M.D. Hafeez – ARPC 2627 ఉన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, AR DSP వీరేష్, DSB ఇన్‌స్పెక్టర్ నాగార్జున, RI నాగరాజు, ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీరుల త్యాగానికి.. మువ్వన్నెల నివాళి...

- హనుమకొండ పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- ప్రభుత్వ పథకాల స్టాళ్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య






**హనుమకొండ, ఆగస్టు 15 : :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తి నడుమ జరిగిన ఈ వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల గౌరవ వందనం, క్రమశిక్షణతో నిర్వహించిన పరేడ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను ఘనంగా సత్కరించారు. వారి త్యాగాలు, సేవలను స్మరించుకుంటూ వారికి గౌరవ వందనం సమర్పించారు.అనంతరం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, వివిధ పథకాల వివరాలను ఎంపీ పరిశీలించారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రాధాన్యంగా గుర్తుచేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, త్యాగం, ప్రజాసేవ, అభివృద్ధి అనే స్ఫూర్తిని ప్రతిబింబించేలా సాగాయి. మువ్వన్నెల జెండా సాక్షిగా దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయులను స్మరించుకుంటూ, ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలనే సందేశం ఈ వేడుకల ద్వారా చాటిచెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట, ఆగస్టు,15:**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ, భవిష్యత్తులో దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నోట్ బుక్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, డీఆర్ఓ రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, ఏవో అనిల్ కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి రషీద్, కలెక్టరేట్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### క్యాంపు కార్యాలయం, జెడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ

అంతకుముందు జిల్లా కలెక్టర్ ప్రియాంక తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యం...

- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో కుటుంబాలకు భరోసా..
- కాంగ్రెస్ పాలనలో సంక్షేమానికి పెద్దపీట... మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే 'నాయిని'
- పదేళ్ల నిరీక్షణకు..స్మార్ట్ సంక్షేమ కార్డు...
- కొత్త రేషన్ కార్డులతో పేద కుటుంబాలకు ఊరట.. అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు





**హనుమకొండ, ఆగస్టు 15 : :** పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు కీలక ఆధారమని, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన కుటుంబాలకు మరింత భరోసా కలుగుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.హనుమకొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో పేదలకు కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, సంక్షేమ పథకాలు అందిన పరిస్థితిని ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. రేషన్ కార్డులు లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు.కొత్త రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయడం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా చేరువవుతాయని చెప్పారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉచిత విద్యుత్ సహా పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తొలి విడతగా 3,500 ఇళ్లు, రెండో విడతగా మరో 2,000 ఇళ్లను మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సామాన్య ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుంటోందని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.రేషన్ కార్డుపై ముఖ్యమంత్రి ఫొటో ఉండటంపై కొందరు చేస్తున్న రాజకీయ విమర్శలను నాయిని రాజేందర్ రెడ్డి తప్పుబట్టారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వాన్ని గుర్తు చేసుకోవడంలో తప్పేమీ లేదన్నారు. గత పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలోనే అనేక హామీలను అమలు చేసిందని పేర్కొన్నారు.హనుమకొండ జిల్లా అభివృద్ధిలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంతో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోందని నాయిని తెలిపారు. రాబోయే రోజుల్లో మిగిలిన హామీలు, సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 15:** హన్మకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. హన్మకొండ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను మంత్రి, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజే శారు.కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డీసీపీ ధార కవిత, అదనపు కలెక్టర్ రవి, డీఆర్వో శ్రీనివాస్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ రైజింగ్–2047తో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెడతాం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 15::** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో భూ భారతి కింద 53,763 దరఖాస్తులు స్వీకరించామని, ఇందిరమ్మ పథకంలో 4,586 ఇళ్లు మంజూరు కాగా 797 పూర్తయ్యాయని చెప్పారు. రూ.2 లక్షల రుణమాఫీ కింద 29,683 మంది రైతులకు రూ.299.34 కోట్లు, రైతు భరోసా కింద 1.27 లక్షల మంది రైతులకు రూ.144.93 కోట్లు అందించినట్లు వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా 2.19 కోట్ల మహిళా ప్రయాణాలు నమోదయ్యాయని, గృహజ్యోతి కింద 58,298 మంది వినియోగదారులకు ప్రయోజనం కలిగిందన్నారు.విద్య, వైద్యం, మహిళా సంక్షేమం, ఆహార భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి, లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేశారు. వివిధ శాఖల స్టాళ్లు, ఫొటో ప్రదర్శనను పరిశీలించారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక హాస్పిటల్‌లో 'హెల్త్ కార్డు' ప్రారంభించిన పంజుగుల బ్రదర్స్

- తాండూర్ ప్రజల ఆరోగ్యానికి మరో అడుగు..
- విఠల్ రెడ్డి జన్మదినం సందర్భంగా వినాయక హాస్పిటల్‌లో హెల్త్ కార్డు ప్రారంభం
- కుటుంబంలోని ఐదుగురికి ఉచిత కన్సల్టేషన్.. వైద్య పరీక్షల్లో ప్రత్యేక రాయితీలు
- తాండూర్ ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: పంజుగుల విఠల్ రెడ్డి

**తాండూర్ మున్సిపల్, ఆగస్టు,15:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పంజుగుల విఠల్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాండూర్ పట్టణంలోని వినాయక హాస్పిటల్‌లో కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక హెల్త్ కార్డును పంజుగుల విఠల్ రెడ్డి, తాండూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది కేక్ కట్ చేసి విఠల్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పంజుగుల విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం, నా జన్మదినం సందర్భంగా నా చేతుల మీదుగా ప్రజలకు ఉపయోగపడే హెల్త్ కార్డును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. తాండూర్ ప్రజలకు అందుబాటులో ఉండే ఈ ఆరోగ్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి పంజుగుల మాట్లాడుతూ.. హెల్త్ కార్డు ద్వారా కుటుంబంలోని ఐదుగురు సభ్యులకు ఉచిత వైద్య కన్సల్టేషన్, ల్యాబ్ సేవల్లో 20% డిస్కౌంట్, ఎక్స్‌రే సేవల్లో 0% డిస్కౌంట్, ఫార్మసీలో 10% డిస్కౌంట్ అందిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. తాండూర్ ప్రజలు ఈ ఆరోగ్య సదుపాయాన్ని



సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండల నాయకులు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దాతల చేయూతతో తిమ్మంపేట ప్రభుత్వ పాఠశాలకు కొత్త కళ

- ఒక్క విద్యార్థి నుంచి 90 మందికి.. వచ్చే ఏడాది 200 మంది లక్ష్యం
- పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం కోరిన సర్పంచ్ మోడెం శ్రీలత
- కోమండ్ల నీరజ–నిరంజన్ కుటుంబం రూ.2 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఆట వస్తువులు, విద్యుత్, ఫ్యాన్లు అందజేత



**నర్సంపేట/తిమ్మంపేట, ఆగస్టు 15 : :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు, గ్రామస్తులు అందించే సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత అన్నారు. తిమ్మంపేట ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు అందించిన సుమారు రూ.5 లక్షల విలువైన ఆర్థిక, వస్తు సహాయంతో ఏర్పాటు చేసిన సౌకర్యాలను శనివారం ప్రారంభించారు.గ్రామానికి చెందిన కోమండ్ల నీరజ–నిరంజన్ కుటుంబం రూ.2 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఆట వస్తువులు, విద్యుత్, ఫ్యాన్ల సౌకర్యం కల్పించగా, వారి మిత్రబృందం కూడా సుమారు రూ.2 లక్షల వరకు సహకరించింది. దొనపాటి విఘ్నేశ్వర్ రెడ్డి, మిత్రులు విద్యార్థుల నోటు పుస్తకాల కోసం రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. బురగాని రాజు ప్రైవేట్ ఉపాధ్యాయుల వేతనాల కోసం నెలకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.60 వేల సహకారం అందిస్తున్నారు.అలాగే బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ తరఫున వీరేశం, శ్రీనివాస్ రూ.1.20 లక్షల విలువైన 30 డెస్కులు, సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు అందించారు. దాతలు పాఠశాలకు విచ్చేసి నూతన సౌకర్యాలను ప్రారంభించిన సందర్భంగా పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు.

### ఒక్క విద్యార్థితో మొదలై.. 90 మందికి చేరిన ప్రస్థానం...

పాఠశాల అభివృద్ధి కమిటీ తరఫున మోడెం మల్లేశం మాట్లాడుతూ.. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో ఒకప్పుడు ఒక్క విద్యార్థితో ఉన్న పాఠశాలలో ప్రస్తుతం 90 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్యను 200కు పైగా పెంచి, నాణ్యమైన విద్యను అందించే ఆదర్శ ప్రభుత్వ పాఠశాలగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు తమ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చి సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, దాతలు, బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు భద్రయ్య, రాజు, చంద్రమౌళి, పద్మ, అక్కపెల్లి అశోక్, బోనగాని రమాదేవి, దునపాటి మానస, దండు గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందించిన 23 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు

**వికారాబాద్, ఆగస్టు,15:** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ ఎస్సై పి. శంకర్, PCR ఎస్సై ఆనంద్ కుమార్,పరిగి ఎస్.ఐ బి. మోహన కృష్ణ పోలీస్ అధికారులు మరియు 20 సిబ్బందికి గౌరవ అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు.శాంతిభద్రతల పరిరక్షణ, వీవీఐపీ బందోబస్తు, నేరాల దర్యాప్తు, నేర నియంత్రణ, కార్యాలయ విధులు తదితర అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు వారిని ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు.అనంతరం కలెక్టరేట్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్, భరోసా, CEIR సెల్, ఆర్మ్స్, ఫింగర్‌ప్రింట్స్ తదితర స్టాల్స్‌ను గౌరవ అతిథులు సందర్శించారు. ఆయా విభాగాల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం గురించి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS గౌరవ అతిథులకు వివరించారు.మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాల్లో పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను గౌరవ అతిథులు పరిశీలించారు.



# ఆర్ బి ఓ ఎల్ ఇండస్ట్రీస్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**యాలాల మండలం, ఆగస్టు,15:** యాలాల మండల పరిధిలోని ఆర్ బి ఓ ఎల్ ఇండస్ట్రీస్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళా రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, జెండా వందనం చేశారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో మైలు రాళ్లను దాటుకొని భారత్ ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన దేశాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.స్వాతంత్ర్య సమరయో ధుల జీవిత గాథలను భారతీయులంతా ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. బ్రిటీషు బానిస సంకెళ్లు తెంచి... స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ రోజు మనందరికీ పర్వదినమన్నారు. మన దేశ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని మువ్వన్నెల జెండాగా సగర్వంగా ఎగరేసిన ఈ రోజు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఓఎల్ ఇండస్ట్రీస్‌కు చెందిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలలో పాల్గొన్న వివేక విద్యా భారతి హైస్కూల్ విద్యార్థులు ...

- రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు,కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేత





**అమనగల్లు,మున్సిపల్, ఆగస్టు15:** రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్, కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేక విద్యా భారతి హై స్కూల్ విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఐటీ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు మరియు కలెక్టర్ నారాయణ రెడ్డి గార్ల చేతుల మీదుగా బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందుకోవడం జరిగింది. కవాతు నిర్వహించిన విద్యార్థులను డి ఈ ఓ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ మహమూద్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో 151వ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్





**కొడంగల్ మున్సిపల్(మం), ఆగస్టు,15:** శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా శ్రీ సిద్దనొంపు పడమటి ఆంజనేయ స్వామి ఆలయంలో 151వ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులతో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆప్యాయంగా కలిసిపోయి, భక్తుడిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని పంపిణీ చేశారు.151వ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం సందర్భంగా ఆలయ ప్రాంగణం హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హిందూ వాహిని యువకులు, కార్యకర్తలు, ఆంజనేయ స్వామి భక్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావంతో సాగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయండి

## జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట, ఆగస్టు,15:** నారాయణపేట జిల్లాలోని రైతు సోదరులు వానకాలం 2026 సీజన్లో ఎల్ నినో ప్రభావం మూలంగా వర్షా బావ పరిస్థితులు నెలకొన సందర్భంలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటలు సాగు చేసి నష్టపోయే దానికంటే ముందుగానే ఇతర ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం వలన తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తీసుకుని అవకాశము ఉన్నదనీ జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. ముఖ్యంగా ఈ సంవత్సరము వర్షాలు సరిగా పడనందున బావులు బోర్లు మరియు కుంటలు చెరువులు మరియు రిజర్వాయర్లలో తగినంత నీళ్లు లేనందున వరి పంటకు సాగు చేయడానికి అవకాశం లేదు కావున రైతులు ఈ నెల చివరి వరకు పెసర మినుములు మొక్కజొన్నలు ఉలువలు అలసంద ఆముదము నువ్వులు మరియు ప్రొద్దుతిరుగుడు పువ్వు తదితర పంటలను సాగు చేసుకోవాల్సిందిగా నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీమంతి సిహెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు....జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చేజారి చేయబడింది




# అజాత శత్రువు అటల్‌జీ

## నేడు వాజ్ పేయి వర్ధంతి


రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు. పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మొరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు. 1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోఖ్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ-లాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే - జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు. 2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు. భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపేయిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించాడు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగష్టు 16న మృతి చెందారు. ఆటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరి పాలనా దినంగా ప్రకటించింది.

# కాలాన్ని జయించిన కథానికా చిత్రం.. 'షోలే'

- 51 వసంతాలు పూర్తి చేసుకున్న భారతీయ వెండితెర అద్భుతం
- జై-వీరూ స్నేహం నుంచి గబ్బర్ భీకరత్వం వరకు చెరగని ముద్ర
- యాక్షన్.. ప్రేమ.. హాస్యం.. ప్రతీకారం.. అన్నింటినీ కలిపిన అపూర్వ సినీ కావ్యం
- తరాలు మారినా తగ్గని ఆదరణ.. భారతీయ ప్రజా సంస్కృతిలో భాగమైన సంభాషణలు




1975 ఆగస్టు 15న దేశం అత్యవసర పరిస్థితి చీకటిలో మునిగిపోయిన రోజులలో, పండుగ దీపంలా వెలిగిన సినిమా 'షోలే'. రమేష్ సిప్పీ ధైర్యమైన దర్శకత్వం, సలీం-జావేద్ అజరామరమైన కథనం, ఆర్‌డి బర్మన్ మధురమైన స్వరాలు, అపూర్వమైన తారాగణం-ఈ సంగమం భారతీయ చిత్రసీమకు చిరస్మరణీయమైన మాస్టర్‌పీస్‌ను అందించింది. ప్రారంభంలో స్పందన సాధారణంగానే ఉన్నప్పటికీ, కొద్ది రోజుల్లోనే మౌఖిక ప్రచారం అగ్నికీలలా వ్యాపించి దేశవ్యాప్తంగా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళ లాడాయి. ముంబై మినర్వా థియేటర్‌లో ఐదేళ్లకు పైగా నిరంతర ప్రదర్శన కొనసాగి రికార్డు నెలకొల్పింది. మొదటి ప్రదర్శనలోనే దేశీయ వసూళ్లు ₹350 మిలియన్లు దాటగా, దాదాపు శతకోటికి పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. 1979లో సోవియట్ యూనియన్ విడుదలతో మొదటి రన్‌లోనే 48.4 మిలియన్ టికెట్లు విక్రయమై, పునర్విడుదలలతో 6 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడై అంతర్జాతీయ స్థాయిలోనూ విజయ పతాక ఎగరేసింది. ఈ చిత్రమే రెండు దశాబ్దాలపాటు




భారతీయ సినీ చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. గ్రామీణ భారతపు నేపథ్యం ఉన్నప్పటికీ, కథ నిర్మాణం డకాయిట్ వెస్ట్రన్ శైలిలో హాలీవుడ్ స్పఘెట్టి వెస్ట్రన్‌ల స్ఫూర్తిని భారతీయ మసాలా మేళవింపుతో స్వదేశీకరించింది. రామగఢ్ అనే ఊరిని ఘరానా దొంగ గబ్బర్ సింగ్ భీకర సంకెళ్ళ నుంచి విముక్తి చేయాలనే సంకల్పంతో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారి థాకూర్ బల్దేవ్ సింగ్, చిన్నచిన్న నేరాలలో పరిమితమై నిమగ్నమైన సాహసవంతులైన జై-వీరూను నియమించు కోవడం కథా కేంద్రం. థాకూర్ చేతులను నరికి వేసిన గబ్బర్ క్రూరత్వానికి ప్రతీకారం తీర్చే ప్రతిజ్ఞ, జై-వీరూ స్నేహం, వీరూ-బసంతి ఉల్లాసం, జై-రాధా నిశ్శబ్ద ప్రేమ, గబ్బర్ భీకరత-ఈ భావరేఖలు కథనాన్ని లోతుగా పటిష్టం చేశాయి. పాత్రల ఎంపికే సినిమా శాశ్వత కీర్తికి పునాది అయింది. జై గా అమితాబ్ బచ్చన్ నిశ్శబ్ద ధైర్యాన్ని, వీరూ గా ధర్మేంద్ర ఉత్సాహం-తరుణోన్మత్తతను, బసంతి గా హేమ మాలిని మాటల వేగం-నృత్య లావణ్యాన్ని, రాధా గా జయ భాదురి మృదువైన విషాదాన్ని, థాకూరు గా సన్జీవ్ కుమార్ ప్రతిఘటన సంకల్పాన్ని, గబ్బర్ గా అమ్జద్ ఖాన్ భీకరత-వికృత హాస్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. "కిత్నే ఆద్మీ థే?", "అరే ఓ సంభా!", "హోలీ కబ్ హై?" వంటి గబ్బర్ సంభాషణలు పల్లెల నుంచి పట్టణాల దాకా జన జీవనంలో భాగమయ్యాయి. సాంకేతికంగా 'షోలే' భారతీయ సినిమాకు కొత్త దారిని చూపింది. బెంగళూరు సమీపంలోని రామనగర రాతి ప్రదేశాలలో రెండు సంవత్సరాలకు పైగా సాగిన చిత్రీకరణ, అప్పట్లోనే 70 మి.మీ. వైడ్‌స్క్రీన్ ప్రింట్లు, ఆరు ట్రాక్ స్టీరియోఫోనిక్ సౌండ్ వినియోగం భారతీయ ఎగ్జిబిషన్ కల్చర్‌కు కొత్త ప్రమాణాలు సృష్టించాయి. హింసాత్మక ఘట్టాలపై సెన్సార్ సూచనలతో అసలు 204 నిమిషాల వెర్షన్‌ను 198 నిమిషాలకు కుదించారు. అసలు ముగింపులో థాకూర్, గబ్బర్‌ను సంహరించే దృశ్యం ఉండగా, సెన్సార్ మార్పులతో గబ్బర్ పోలీసుల చేత అరెస్టవడం చూపించారు. 2014లో 3డి విడుదల, 2025లో ఇటలీ బొలోనియాలో 'ఇల్ సినిమా రిత్రోవాటో'లో రీస్టోర్డ్ ప్రింట్ ప్రత్యేక ప్రదర్శన-ఈ చిత్రం కాలాన్ని దాటి పునరావిష్కృతమవుతూ వస్తోంది. సంగీతం విషయంలో ఆర్.డి. బర్మన్ స్వరాలు కథనానికి ఆత్మను అందించాయి. "యే దోస్తీ హమ్ నహీ తోడేంగే" జై-వీరూ స్నేహాన్ని శాశ్వతం చేస్తే, "మెహబూబా మెహబూబా" దేశ. వ్యాప్తంగా ఉత్సవ గీతంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గబ్బర్ ఘట్టాలకు భీకరమైన ముద్ర వేసింది. విడుదల సమయంలో కొంత మీడియా విమర్శించినప్పటికీ, ప్రేక్షకుల ఉత్సాహం వసూళ్లను ఆకాశానికెత్తింది. చైనా, సోవియట్ యూనియన్ వంటి మార్కెట్లలో విడుదలై అంతర్జాతీయ గుర్తింపును తెచ్చుకుంది. అవార్డుల పరంగా 1976లో 23వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో అత్యధిక నామినేషన్లు పొందినప్పటికీ, చివరికి ఎడిటర్ ఎం.ఎస్. శిండేకు మాత్రమే బెస్ట్ ఎడిటింగ్ అవార్డు దక్కింది. కానీ 2005లో 50 ఏళ్ల ఫిల్మ్‌ఫేర్ సందర్భంగా 'పచాస్సాల్ కా బెస్ట్ ఫిల్మ్'గా ఎంపికైంది. 2002లో బ్రిటిష్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన పోలింగ్‌లో టాప్ 10 భారతీయ చిత్రాలలో ప్రథమ స్థానం, 2023లో టైమ్ అవుట్ జాబితాలో '100 బెస్ట్ ఇండియన్ ఫిల్మ్స్'లో అగ్రస్థానం సాధించింది. చిత్రీకరణ స్థలం రామనగర నేడు 'షోలే హిల్స్'గా పర్యాటక కేంద్రమై, సినీ యాత్రికులకు యాత్రా స్థలంగా మారింది. తెరపై నిలిచిన జై-వీరూ స్నేహం, గబ్బర్ క్రూరత్వం, థాకూర్ ధర్మ సంకల్పం, బసంతి ఉల్లాసం, రాధా నిశ్శబ్దం భారతీయ సామూహిక స్మృతిలో చిరస్థాయిగా నిలిచాయి. డకాయిట్ వెస్ట్రన్, మసాలా, యాక్షన్, హాస్యం, ప్రేమ, ఉత్కంఠ-అన్నీ కలగలిపి- ప్రధాన ప్రవాహంలో స్థిరపరిచిన ఈ చిత్రం తర్వాతి తరాల కథకులకు పాఠశాలగా నిలిచింది. యాభై ఏళ్ల తరువాత కూడా 'షోలే' కేవలం ఒక సినిమా కాదు, అది భారతీయ ప్రజా సంస్కృతికి నాడీ స్పందన, శబ్ద-దృశ్యాల సృజనాత్మకతకు ప్రతీక, తరతరాల గుండెల్లో అజరామరంగా నిలిచిన కల.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పుంభావ సరస్వతి వానమామలై

## నేడు వానమామలై వరదాచార్యులు జయంతి

**తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంథస్థం చేయడం విశేషమే మరి.**



వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా.

ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు.

1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు. అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు.

తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు. "పోతన చరిత్రము" వ్రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు, ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుఱ్ఱకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము". మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే. అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే.

**'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు. ఇతని శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఘనంగా మొదలెట్టిన టీమిండియా



- దేవదత్ పడిక్కల్ అజేయ శతకం
- రాహుల్, పడిక్కల్ ఆధిపత్యం..
- తొలి రోజు 2 వికెట్లకు 288 పరుగులు

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా ఘనంగా మొదలెట్టింది. గాలే వేదికగా శనివారం ప్రారంభమైన మ్యాచ్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో ఆధిపత్యం చెలాయించింది. దేవదత్ పడిక్కల్(178 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 131 బ్యాటింగ్) అజేయ శతకంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 73 ఓవర్లలో 2 వికెట్లకు 288 పరుగుల భారీ స్కోర్ చేసింది. దేవదత్ పడిక్కల్‌తో పాటు రిషభ్ పంత్(36 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కేఎల్ రాహుల్(162 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 77 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో ప్రబాత్ జయసూర్య ఒక వికెట్ తీసాడు. వర్షం అంతరాయం కారణంగా తొలి రోజు 77 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్(32) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. శ్రీలంక అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత తప్పిదంతో జైస్వాల్ బలయ్యాడు. కేఎల్ రాహుల్ ఆడిన బంతిని అడ్డుకోవడానికి కేశర డైవ్ చేయగా.. సింగిల్‌కు ప్రయత్నించిన జైస్వాల్ అతన్ని తాకి కిందపడిపోయాడు. అప్పటికే కేఎల్ రాహుల్ నాన్‌స్ట్రైక్ ఎండ్‌కు రాగా.. జైస్వాల్ కూడా యూటర్న్ తీసుకున్నాడు. దాంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది. క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్‌తో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ జోడీ ఆచితూచి ఆడటంతో టీమిండియా 27 ఓవర్లలో 101/1 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఇదే సమయంలో వర్షం రావడంతో గంటన్నర తర్వాత రెండో సెషన్ మొదలైంది. రాహుల్, పడిక్కల్ తమ జోరును కొనసాగించారు. తమకే సాధ్యమైన షాట్లతో శ్రీలంక బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. రాహుల్ కాస్త నిదానంగా ఆడినా.. పడిక్కల్ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలో అతను 81 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కేఎల్ రాహుల్ 127 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. దాంతో టీమిండియా 197/1 స్కోర్‌తో టీ బ్రేక్ వెళ్లింది.

ఆఖరి సెషన్‌లో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ కొనసాగించలేకపోయాడు. చేతి, కాలి కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా మైదానం వీడాడు. క్రీజులోకి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రాగా.. కేశర నువంత బౌలింగ్‌లో క్విక్ సింగిల్ తీసి పడిక్కల్ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పడిక్కల్‌కు ఇదే తొలి టెస్ట్ సెంచరీ కావడం గమనార్హం. తన మూడో టెస్ట్‌లోనూ ఈ ఫీట్ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్(16) నిరాశపర్చాడు. ప్రబాత్ జయసూర్య బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. క్రీజులోకి పంత్ రాగా.. వర్షం అంతరాయం కలిగించింది. కాసేపటి తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. పంత్(27 బ్యాటింగ్), పడిక్కల్ దూకుడుగా ఆడారు. అజేయంగా 52 పరుగులు జోడించి తొలి రోజు ఆటను ముగించారు.

కాగా.. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత్ తన చారిత్రక 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతుండగా ఈ విచిత్రమైన రనౌట్ నమోదు కావడం విశేషం. రెండు మ్యాచ్‌ల ఈ టెస్టు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. 2027 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలవడానికి ఇరు జట్లకు ఈ సిరీస్ పాయింట్లు ఎంతో కీలకం. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది.

# నిరాశగా వెనుదిరిగిన జైస్వాల్



సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌తో సరైన సమన్వయం లోపించడంతో ఇద్దరు భారత బ్యాటర్లు ఒకే ఎండ్‌కు (క్రీజులోకి) చేరడం, చివరకు జైస్వాల్ తన వికెట్‌ను సమర్పించుకోవడం మ్యాచ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత ఇన్నింగ్స్ కొనసాగుతున్న సమయంలో శ్రీలంక స్పిన్నర్ కేశర నువాంత వేసిన ఫ్లైటెడ్ డెలివరీని కేఎల్ రాహుల్ మిడ్-ఆన్ దిశగా చక్కగా డ్రైవ్ చేశాడు. బంతిని ఆపేందుకు బౌలర్ నువాంత డైవ్ చేసినప్పటికీ బంతి అతడి చేతికి చిక్కకుండా ముందుకు వెళ్లింది. అయితే అదే సమయంలో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్‌ను బౌలర్ ఢీకొట్టాడు. దీంతో అదుపు తప్పిన జైస్వాల్ పిచ్‌పై కిందపడిపోయాడు. మరోవైపు, షాట్ కొట్టిన వెంటనే సింగిల్ కోసం పరుగు తీసిన కేఎల్ రాహుల్ అప్పటికే పిచ్ మధ్యలోకి చేరుకున్నాడు. నాన్-స్ట్రైకర్‌గా ఉన్న జైస్వాల్ కింద పడిపోవడం చూసి రాహుల్ ఒక్కసారిగా తన పరుగును నిలిపివేశాడు. కానీ, వెంటనే తేరుకుని పైకి లేచిన జైస్వాల్.. పరుగు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ముందుకు అడుగు వేశాడు. ఆ తర్వాత వెంటనే జైస్వాల్ తన మనసు మార్చుకుని వెనక్కి తిరిగి బౌలర్ వైపు ఉన్న క్రీజులోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే జైస్వాల్ ముందుకు రావడాన్ని పరుగు పూర్తి చేయమనే సంకేతంగా భావించిన కేఎల్ రాహుల్ వేగంగా నాన్-స్ట్రైకర్ ఎండ్‌కు చేరుకున్నాడు. చివరకు ఇద్దరు బ్యాటర్లు ఒకే వైపు ఉన్న క్రీజులోకి పరుగులు తీశారు. జైస్వాల్ కంటే ముందే రాహుల్ తన బ్యాట్‌ను క్రీజులో ఉంచడంతో జైస్వాల్ క్రీజు బయటే మిగిలిపోయాడు. శ్రీలంక ఫీల్డర్ ప్రభాత్ జయసూర్య విసిరిన బంతిని అందుకున్న వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లా ప్రారంభంలో బెయిల్స్‌ను పడగొట్టలేదు. స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కెప్టెన్ ధనంజయ డి సిల్వా వైపు చూస్తూ.. రనౌట్ చేయవచ్చా లేదా అని అడిగాడు. బ్యాటర్లు ఢీకొనడం వల్ల ఇది జరిగిందా క్రీడాస్ఫూర్తి పాటించాలా అనే సందిగ్ధత వారిలో కనిపించింది. అయితే బెయిల్స్ తొలగించడంలో ఎలాంటి ఇబ్బంది లేదని కెప్టెన్ ధనంజయ డి సిల్వా సంకేతం ఇవ్వడంతో డిక్వెల్లా వెంటనే స్టంప్స్‌ను పడగొట్టాడు. అనంతరం శ్రీలంక జట్టు రనౌట్ అప్పీల్‌ను ఉపసంహరించుకుందా లేదా అనే విషయాన్ని ఫీల్డ్ అంపైర్లు నిర్ధారించుకున్న తర్వాత జైస్వాల్‌ను రనౌట్‌గా ప్రకటించారు. దీంతో 37 బంతుల్లో 5 ఫోర్ల సాయంతో 32 పరుగులు చేసిన జైస్వాల్ నిరాశగా వెనుదిరిగాడు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో యశస్వి జైస్వాల్ రనౌట్ కావడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో 2024లో మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 82 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. గతేడాది ఢిల్లీలో వెస్టిండీస్‌పై 175 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడిన సందర్భంలోనూ రనౌట్‌గానే వెనుదిరిగాడు. ఇప్పుడు మరోసారి గాలేలో దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు.

# హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం

- తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ ఘన విజయం
- తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్



నెదర్లాండ్స్‌లో జరుగుతున్న హాకీ ప్రపంచకప్‌లో భారత పురుషుల జట్టు శుభారంభం చేసింది. పూల్-డిలో భాగంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించాడు. హర్మన్‌ప్రీత్ రెండు గోల్స్ చేయగా సంజయ్ ఒక గోల్ సాధించాడు. మ్యాచ్ చివరి దశలో వేల్స్ ఒక గోల్ చేసినా అప్పటికే భారత్ తిరుగులేని ఆధిక్యంలో ఉండటంతో విజయానికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. మ్యాచ్ ప్రారంభం నుంచే భారత ఆటగాళ్లు దూకుడుగా ఆడారు. తొలి క్వార్టర్‌లోనే భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించింది. ఏడో నిమిషంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సంజయ్ అద్భుతమైన డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేశాడు. వేల్స్ గోల్‌కీపర్‌కు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా బంతిని నెట్‌లోకి పంపాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా భారత జట్టు ఒత్తిడి కొనసాగించింది. మరో పెనాల్టీ కార్నర్‌ను భారత్ దక్కించుకోగా, ఈసారి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తన సత్తా చాటాడు. అద్భుతమైన షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్ ఎడమ వైపునకు పంపాడు. దీంతో తొలి క్వార్టర్‌లోనే భారత్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి 15 నిమిషాల్లోనే భారత ఆటగాళ్లు ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. రెండో క్వార్టర్‌లో వేల్స్ కొంత మెరుగ్గా రక్షణాత్మకంగా ఆడింది. భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించినప్పటికీ దానిని గోల్‌గా మలచలేకపోయింది. బంతిని అందుకునే సమయంలో చిన్న పొరపాటు జరగడంతో భారత అవకాశాన్ని కోల్పోయింది. మరో పెనాల్టీ కార్నర్‌లో హర్మన్‌ప్రీత్ చేసిన ప్రయత్నం కూడా లక్ష్యాన్ని చేరలేదు. ఈ క్వార్టర్‌లో ఇరు జట్లూ గోల్ చేయలేకపోయాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో భారత ఆటగాళు మరింత నియంత్రణతో ఆడారు. ఓపెన్ ప్లేలో కూడా అవకాశాలను సృష్టిస్తూ ప్రత్యర్థి డిఫెన్స్‌పై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో భారత్‌కు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ మరోసారి తన డ్రాగ్‌ఫ్లిక్‌తో మెరిశాడు. బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని 3-0కు పెంచాడు. హర్మన్‌ప్రీత్‌కు ఇది మ్యాచ్‌లో రెండో గోల్.మూడో క్వార్టర్‌లో ఇరు జట్ల నుంచి పెద్దగా గోల్ అవకాశాలు కనిపించలేదు. అయితే 3-0 ఆధిక్యంతో ఉన్న భారత్ మ్యాచ్‌పై పూర్తిగా పట్టు సాధించింది. చివరి క్వార్టర్‌లో వేల్స్ కనీసం ఒక గోల్ చేసి లోటును తగ్గించాలని ప్రయత్నించింది. భారత గోల్‌కీపర్ మోహిత్ కీలక సమయంలో అద్భుతమైన సేవ్ చేశాడు. వేల్స్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను సమర్థంగా అడ్డుకుని భారత ఆధిక్యాన్ని కాపాడాడు. అయితే మ్యాచ్ ముగిసే సమయంలో వేల్స్‌కు ఓ గోల్ దక్కింది. భారత గోల్‌పోస్ట్ ముందు తీవ్ర గందరగోళం నెలకొన్న సమయంలో సామ్ వెల్ష్ బంతిని గోల్‌లైన్ దాటించాడు. వీడియో అంపైర్ పరిశీలన తర్వాత గోల్‌ను చెల్లుబాటు అయ్యేదిగా ప్రకటించారు. దీంతో వేల్స్ 1-3తో లోటును తగ్గించింది. ఆ తర్వాత భారత్ ఎలాంటి అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. ᐟమ్యాచ్‌లో భారత్‌కు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్లు లభించగా, వాటిలో మూడు గోల్స్‌గా మారడం జట్టు బలాన్ని చాటింది. మరోవైపు, డిఫెన్స్‌లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేసింది. ప్రత్యర్థికి అవకాశాలు వచ్చినప్పుడు గోల్‌కీపర్ మోహిత్‌తో పాటు డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. ప్రపంచకప్‌లో భారత జట్టు ఈసారి పతకంపై గురిపెట్టింది. గతంలో ప్రపంచకప్‌లో భారత్ మూడు పతకాలు సాధించగా 1975లో మాత్రమే స్వర్ణ పతకం గెలిచింది. ఈసారి పతక కరవును ముగించాలనే పట్టుదలతో జట్టు బరిలోకి దిగింది. టోర్నీకి ముందు ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో జర్మనీ, నెదర్లాండ్స్ వంటి బలమైన జట్లపై భారత్ మంచి విజయాలు సాధించింది. పాకిస్థాన్‌ను రెండుసార్లు ఓడించడంతో పాటు ఇంగ్లాండ్‌పైనా విజయం సాధించింది. ప్రపంచకప్‌లో భారత్ పూల్-డిలో ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్‌తో కలిసి ఉంది. తొలి మ్యాచ్‌లో వేల్స్‌ను ఓడించిన భారత్, తదుపరి మ్యాచ్‌లో ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఆ తర్వాత ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడనుంది. ఈసారి ప్రపంచకప్‌లో సంప్రదాయ క్వార్టర్‌ఫైనల్ విధానం ఉండదు. తొలి దశలో ప్రతి పూల్‌లోని టాప్-2 జట్లు తదుపరి దశకు చేరతాయి. అక్కడి నుంచి సెమీఫైనల్ బెర్తులు ఖరారవుతాయి. దీంతో ప్రతి మ్యాచ్‌లో సాధించే విజయం భారత్‌కు కీలకంగా మారింది.



# విజయం దిశగా బంగ్లాదేశ్

**తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శన**

**గ్రీన్, అలెక్స్ క్యారీపైనే ఆసీస్ ఆశలు**

ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ విజయం దిశగా సాగుతోంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా డార్విన్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 161 పరుగులు చేసింది. క్రీజులో కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్)తో పాటు అలెక్స్ క్యారీ(19 నాటౌట్) ఉన్నాడు. ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) మరోసారి విఫలమవ్వగా.. మార్నస్ లబుషేన్(31), స్టీవ్ స్మిత్(44) కీలక భాగస్వామ్యాన్ని అందించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మూద్(2/33) రెండు వికెట్లు తీయగా.. తైజుల్ ఇస్లామ్, మెహ్‌ది హసన్ మీరాజ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 351/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 138 ఓవర్లలో 426 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మెహ్‌దీ హసన్(154 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీతో రాణించాడు. తంజీద్ హసన్(197 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 101) సెంచరీతో.. నజ్ముల్ హోస్సేన్ షాంటో(126 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 84) హాఫ్ సెంచరీతో చెలరేగిన సంగతి తెలిసిందే. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్(6/89) ఆరు వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్(2/79) రెండు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్, నాథన్ లయన్ తలో వికెట్ తీసారు. దాంతో బంగ్లాదేశ్‌కు 228 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. అదే తడబాటు కొనసాగించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(17), జేక్ వెదరాల్డ్(0) తీవ్రంగా నిరాశపర్చారు. ఈ క్రమంలో లబుషేన్, స్మిత్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. లబుషేన్‌ను తైజుల్ ఇస్లామ్ ఔట్ చేయగా.. స్మిత్‌ను మెహ్‌దీ హసన్ మిరాజ్ పెవిలియన్ చేర్చి హాఫ్ సెంచరీని అడ్డుకున్నాడు. కామెరూన్ గ్రీన్(43 బ్యాటింగ్), అలెక్స్ క్యారీ(19 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా మూడో రోజు ఆటను ముగించారు. ఈ ఇద్దరి ప్రదర్శనపైనే ఆసీస్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ఇద్దరూ సెంచరీలతో చెలరేగి భారీ లక్ష్యం నమోదు చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో ఆసీస్ గట్టెక్కలేదు. నాలుగో రోజు ఆటలో బంగ్లాదేశ్ బౌలర్లు చెలరేగిన ఆసీస్‌ను త్వరగా ఆలౌట్ చేస్తే బంగ్లాదేశ్ విజయం సులువు అవుతుంది. ప్రస్తుతం ఆసీస్ ఇంకా 67 పరుగుల వెనుకంజలో ఉంది. లక్ష్యం 200 ధాటకుండా చూసుకుంటే బంగ్లాదేశ్ చారిత్రాత్మక విజయం సాధ్యమవుతోంది. ఆసీస్‌పై బంగ్లాదేశ్ ఇప్పటి వరకు టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. 23 ఏళ్ల తర్వాత ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ ఆడుతోంది.

# 19 ఏళ్లకే మృత్యుఒడికి..

**ట్రాక్‌పై యువ సైక్లిస్ట్ దుర్మరణం..!**

సైకిల్ ట్రాక్‌పై జరిగిన ప్రమాదం ఓ యువ సైక్లిస్ట్‌ను బలిగొన్నది. ఈ విషాదకరమైన ఘటనలో బ్రిటన్‌కు చెందిన 19 ఏళ్ల ఫిన్లే టార్లింగ్ దుర్మరణం చెందాడు. వొల్టా ఏ పోర్చుగల్ ఈవెంట్లో ఎనిమిదో దశలో ఫిన్లే ఉండగా.. హఠాత్తుగా ఓ వాహనం ట్రాక్ మీదకు దూసుకొచ్చింది. వ్యతిరేక దిశలో వచ్చిన ఆ ట్రక్ సైక్లిస్ట్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయాలతో అతడు మరణించాడు. ప్రతిభావంతుడైన ఫిన్లే మృతిపట్ల ప్రపంచవ్యాప్తంగా సైక్లిస్ట్‌లు సంతాపం ప్రకటించారు. చిన్న వయసులోనే టైమ్ ట్రయల్స్‌లో ఆరితేరిన ఫిన్లే టార్లింగ్ సైకిల్ ట్రాక్ మీదే ప్రాణాలు వదిలాడు. వొల్టా ఏ పోర్చుగల్ ఎనిమిదో దశలో ఉండగా.. అతడిని ఓ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలతో అతడు మరణించాడు. దాంతో, నిర్వాహకులు వెంటనే పోటీని నిలిపివేశారు. సైక్లింగ్‌లో ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న ఫిన్లే మృతితో ప్రపంచంలోని సైక్లిస్ట్‌లు విచారం వ్యక్తం చేశారు. ఈరోజు వొల్టా పోర్చుగల్‌లో ఫిన్లే టారింగ్ మరణించాడనే విషయాన్ని బద్ధలైన హృదయంతో మీకు తెలియజేస్తున్నాం. మా టీమ్‌లోని ప్రియమైన సభ్యుడు ఫిన్. ముఖ్యంగా అతడు చాలామందికి బిడ్డలాంటివాడు. సోదరుడే కాదు పలువురికి అతడు స్నేహితుడితో సమానం. అతడిని మేమెంతో మిస్సవుతాం' అని ఫిన్లే ప్రతినిధ్యం వహిస్తున్న ఎస్ఎస్ఎన్ డెవలప్‌మెంట్ టీమ్ వెల్లడించింది. ఫిన్లే ఈ లోకాన్ని వదిలి వెళ్లడం పట్ల టోర్నీ నిర్వాహకులు, పోర్చ్‌గీస్ సైక్లింగ్ సమాఖ్య అతడి కుటుంబసభ్యులకు ప్రగాఢమైన సానుభూతి తెలియజేశారు.






# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

# డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక

టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకొచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.








# కట్టలు తెంచుకున్న రోమాన్స్ .. హుషారు పిట్టలు!

యువతరమే లక్ష్యంగా తీర్చిదిద్దిన తాజా చిత్రం 'హుషారు పిట్టలు'. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ లాంటి పెద్ద సంస్థ దీన్ని స్వయంగా విడుదల చేస్తుండటం.. ప్రేక్షకుల దృష్టి ఈ సినిమాపై పడింది. రవి (అన్ష్) టాపర్. టెన్త్‌లో స్కూల్ ఫస్ట్. చదువు తప్ప మరో ధ్యాస లేని ఆ కుర్రాడిని.. ఊళ్లోని బాలు గ్యాంగ్ అశ్లీల వీడియోలు చూపించి చెడగొడుతుంది. దీంతో పుస్తకాల్ని పక్కకు పెట్టేసి అమ్మాయిల్ని పడేసే పనిలో పడతాడు. ఈ క్రమంలోనే అదే ఊరిలో ఉండే చిట్టి (వాసవి గణేశన్)ని ఇష్టపడతాడు. అప్పటికే అతనిపై ఆకర్షణతో ఉన్న ఆమె కూడా అతడికి దగ్గరవుతుంది. పరిపక్వత లేని ఆ వయసులో వాళ్లిద్దరూ హద్దులు దాటేస్తారు. ఓరోజు అలా కలిసి ఉండగా తల్లిదండ్రులకు దొరికిపోతారు. మరి ఆ తర్వాత ఏమైంది? తమ పిల్లల్ని అలా చూడకూడని స్థితిలో చూసిన ఆ తల్లిదండ్రులు ఏమైపోయారు? ఆ బాధని గుండెల్లో దాచుకుని ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు? ఓవైపు అమ్మానాన్నల వ్యతిరేకతను.. సమాజం నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమ కోసం ఏం చేశారు? దాని వల్ల వాళ్ల జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటి? ఆఖరికి వాళ్లు ఒక్కటయ్యారా.. లేదా? చిన్న వయసులో తెలిసీ తెలియక చేసిన తప్పు వల్ల ఆఖరికి వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అన్నది మిగిలిన కథ. ఇది యువతరం లక్ష్యంగా రూపొందిన సినిమా. టీజర్.. ట్రైలర్‌లతోనే ఈ చిత్ర కంటెంట్ ఏంటి? ఎంత బోల్డ్‌గా ఉంటుందనే దానిపై స్పష్టత ఇచ్చేశారు. 'బస్ స్టాప్', 'ఈరోజుల్లో..' లాంటి చిత్రాల ఛాయల్లోనే సాగుతుంది. సినిమాలో సింహభాగం అడల్ట్ కంటెంట్‌తో నవ్వులు పంచి.. ఆఖరిలో ఎమోషనల్ టచ్‌తో చిన్న సందేశం ఇచ్చి ప్రేక్షకుల్ని థియేటర్ నుంచి బయటికి పంపుతుంది. ఇది పిల్లలతో పాటు తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమే అయినప్పటికీ.. ఆ అడల్ట్ కంటెంట్‌ని స్వీకరించే సాహసం చేస్తారా అన్నది సందేహమే. నాయకా నాయికల పాత్రల పరిచయం.. ఒకరిపై ఒకరికి ఆకర్షణ.. ఫోన్ ముచ్చట్లు.. హద్దులు దాటి దగ్గరయ్యేందుకు చేసే ప్రయత్నాలు.. కథలో సంఘర్షణని రగిలించేలా ఉంటాయి. అంత వరకు చాటుమాటుగా సాగిన రవి - చిట్టీల వ్యవహారం ఇంటిదాకా చేరడంతో ద్వితీయార్థం ఆసక్తికరంగా మొదలవుతుంది. కాకపోతే ఆయా సన్నివేశాలన్నీ ఊహలకు అందేలా ఉంటాయి. ఇక ఎప్పుడైతే వీళ్లు రెడ్ హ్యాండెడ్‌గా ఇంట్లో వాళ్లకి దొరికిపోతారో అక్కడి నుంచి కథ సీరియస్ టోన్‌లోకి టర్న్ తీసుకుంటుంది. రవి - చిట్టి తప్పటడుగులు వేయడం వెనకున్న కారణాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశారు. పిల్లలు ఎదురుగా తల్లిదండ్రులు చేసే పనులు వాళ్ల వ్యక్తిత్వాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయి.. అతి గారాబం.. తప్పుడు స్నేహాలు, సెల్ ఫోన్ వాడకం వాళ్లని ఎలా తప్పుడు దారుల్లో నడిచేలా పురిగొల్పుతాయన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. పరిణతి లేని ప్రేమికుల్లా ఆ రెండు పాత్రల్లో అన్ష్, వాసవి సహజమైన నటనతో ఆద్యంతం అలరించారు. రొమాంటిక్ సీన్స్ తో పాటు భావోద్వేగ భరిత సన్నివేశాల్లోనూ మెప్పించారు. ముఖ్యంగా చిట్టి పాత్రలో వాసవి చెప్పే డైలాగ్స్.. శైలు పాత్రని ఇబ్బంది పెడుతూ తను చేసే హంగామా యువతకి బాగా వినోదాన్ని పంచిస్తుంది. కథానాయిక తండ్రి పాత్రలో గోవర్ధన్, హీరో తల్లిదండ్రులుగా సునీత, రమేష్ ఆకట్టుకుంటారు. ఇది తెలిసిన కథే అయినా.. యువతరాన్ని ఆకట్టుకునేలా మలచడంలో దర్శకుడు విజయం సాధించాడు.

# సైరాబాను ఫస్ట్ లుక్ విడుదల

హీరో ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త తెలుగు చిత్రం 'సైరాబాను' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నేడు, స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆఫీషియల్ గా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన 'మసూద' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న బాంధవి శ్రీధర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాస్య మూవీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత రాజేష్ దండా ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా, ఈ చిత్రం ద్వారా ఫణి కృష్ణ సిరికి దర్శకుడిగా తెలుగు చిత్రసీమకు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా విభిన్న సంస్కృతుల నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ అండ్ వైబ్రెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. ఔట్ అండ్ ఔట్ కామెడీ, ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర స్వరాలను అందిస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే చిత్ర యూనిట్ ప్రకటించనుంది. అయితే పోస్టర్‌లోని నేపథ్యం కథను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది. ఒకవైపు హిందూ దేవాలయం, మరోవైపు ఇస్లామిక్ శైలిలో నిర్మించిన కట్టడం రెండు విభిన్న ప్రపంచాలను ఒకే ఫ్రేమ్‌లో నిలబెట్టినట్లుగా అనిపిస్తోంది. మధ్యలో ఎగురుతున్న తెల్ల పావురాలు శాంతి, ప్రేమకు ప్రతీకగా నిలుస్తూ పోస్టర్ లుక్ మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో హీరో ఆది సాయికుమార్ పక్కా తెలుగు సాంప్రదాయాలు, పద్ధతులు ఉన్న కుటుంబానికి చెందిన యువకుడిగా నటిస్తున్నారు. అలాగే, హీరోయిన్ బాంధవి శ్రీధర్ ఆధునిక ఆలోచనలు ఉన్న ముస్లిం యువతి (సైరాబాను) పాత్రలో కనిపిస్తున్నారు. వేర్వేరు నేపథ్యాలు, ఆచారాలు ఉన్న ఈ ఇద్దరి మధ్య ప్రేమ ఎలా చిగురించింది, వారి ప్రేమను గెలిపించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడ్డారు అనేదే ఈ సినిమా కథాంశంగా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఈ ప్రేమకథను ఎమోషనల్‌గానే కాకుండా, రెండు కుటుంబాల మధ్య జరిగే ఔట్ అండ్ ఔట్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కూడా తెరకెక్కిస్తున్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com